
# నేను - నా రచనలూ - నా పాఠకులు

–యద్ధనపూడి సులోచనారాణి



# విషయసూచిక


| | |
|---|---|
| మీనా | 3 |
| ఆరాధన | 5 |
| ఈ దేశం మాకేమిచ్చింది | 8 |
| పార్థు | 13 |
| కీర్తికిరాటాలు | 16 |
| గిరిజాకల్యాణం | 19 |
| మోహిత | 21 |
| సుకుమారి | 23 |
| ప్రేమ సింహాసనం | 26 |
| అగ్నిపూలు | 28 |
| నీరాజనం | 31 |
| కలల కౌగిలి | 34 |
| స్నేహమయి | 36 |
| పెళ్ళి, పిల్లలు, జీవితం | 39 |
| నిశాంత | 42 |


# మీనా



## నవలారాణి నవలల నేపథ్యం

నేను మీనా నవల వ్రాసి దాదాపు 40 సంవత్సరాలు అవుతోంది. కానీ ఈ నవల ఇప్పటికీ ప్రతి సంవత్సరం రీ ప్రింటుకి వస్తూ, నాకూ నా పబ్లిషర్స్‌కి ధనలాభం తేవటమే కాకుండా, మమ్మల్ని ఆశ్చర్యానందాల్లో ముంచెత్తుతోంది. తరాలు మారినాయి. అయినా ఈ నవల పాఠకులు ఆదరణతో, నిత్యనూతనంగా పరుగులు దీస్తూనే ఉంది. నేను మీనా నవల వ్రాసేటప్పుడు 'మీనా'ని ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వపు లక్షణంగల అమ్మాయిగా సృష్టించానని అనుకున్నాను. కానీ 'మీనా' సీరియల్ యువ మాసపత్రికలో వస్తుంటే, అమ్మాయిల దగ్గరనుంచీ అమ్మ వయసుగల స్త్రీల దగ్గర నుంచీ ఇది మాకథే అన్నట్లుంది అన్నట్టు అసంఖ్యాకంగా వచ్చిన ఉత్తరాలు నన్ను చకితురాలిని చేసాయి. నేను త్వరలోనే ఒకటి అర్థం చేసుకున్నాను. 'మీనా' అనే అమ్మాయి ఒక సాధారణమైన వ్యక్తిత్వంగల అమ్మాయి. అందుకే నా చుట్టూ ఉన్న సమాజంలో అనేకమంది అమ్మాయిల గుండె తలుపులు తట్టి, వారితో మమేకం అయిపోయింది. తలితండ్రులు - పిల్లలు - ఇంటి పరువు ప్రతిష్టలు - స్వతంత్ర భావాలుకల నూతన తరం, నోరువిప్పి పైకి చెప్పలేని కుటుంబ వాతావరణం నేపథ్యం, ఇది అప్పటికీ - ఇప్పటికీ మారలేదని ఇప్పుడు అది ఇంకా ఎక్కువైందనీ, ఇప్పటి చదువుకున్న ఆడపిల్లలు నాకు చెబుతున్నారు.

నాకు తెలిసిన ఒక బ్యాంక్ ఆఫీసర్ ఉంది. ఆమె ఫ్రెండ్‌కి చాలా సుస్తీ చేసి తగ్గింది. ఆమె ఫ్రెండ్‌ని చూడటానికి వెళుతూ, ఫ్లవర్ బొకేతో పాటు, ఆ స్నేహితురాలికి అత్యంత ఇష్టమైన నవల 'మీనా'ని కూడా బహుమతి ఇవ్వాలని తనకి వెళ్ళటానికి తీరిక చిక్కక, ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న కూతురుని బుక్‌షాపుకు వెళ్ళి కొని తీసుకురమ్మని చెప్పింది. ఆ అమ్మాయి వెళ్ళి కొని తెచ్చింది. ఏమాత్రం ఆకర్షణ లేని, పాత పద్ధతి గెటప్‌తో ఉన్న 'మీనా' రెండు భాగాలని చూసి పెదవి విరిచింది. మొత్తం పేజీల సంఖ్య 700 పైన ఉన్నాయి. అమ్మా - ఆమె స్నేహితురాలు ఫోన్‌లో 'మీనా' గురించి మాట్లాడటం చాలాసార్లు వింది.




ఇంటికి వచ్చిన తర్వాత, సినిమాకి వెళదామన్న ఫ్రెండ్ రానని ఫోన్ చేయటంతో, బోర్ కొట్టి, 'మీనా' అక్కడక్కడ చదవటం మొదలు పెట్టి, కుతూహలం అనిపించి మొదటినుంచీ చదవటం ప్రారంభించింది. సాయంత్రం వాళ్ళమ్మ బ్యాంక్ నుంచీ వచ్చేవరకూ చదువుతూనే ఉంది. తల్లి, కూతురు తెలుగు నవల చదవటం చూసి ఆశ్చర్యపోయింది. అందులో 'మీనా' నవల. మమ్మీ బాగుంది అంది పూర్తి చేసిన తరువాత. తల్లి ఆ నవలని స్నేహితురాలికి బహుమతి ఇస్తే, కూతురు షాపుకి వెళ్ళి మళ్ళీ కొనుక్కువచ్చి, తను చదవటమే కాదు, తన స్నేహితురాలికి కథ చెప్పి ఆమె చేత కూడా చదివించింది. వాళ్ళమ్మతో నా దగ్గరకి వచ్చినప్పుడు 'ఆంటీ నవల ఇప్పటి జనరేషన్ గురించి వ్రాసినట్లుంది. ఎలా వ్రాసారు మీరు' అంది.


నాకు సంతోషం అనిపించింది. 'మీనా' నవల నేపథ్యం ఏముంది ప్రత్యేకత!

తలితండ్రులు - పిల్లలు - పరువు ప్రతిష్టలు. ఈ మూడు స్థంభాలే పునాది. ప్రతి తల్లితండ్రులు - ముఖ్యంగా తల్లి తన పిల్లలు, అందులో మరీ కూతురు - సలక్షణంగా పెరిగి, చదువుకుని, వివాహం చేసుకుని, తనలాగే బిడ్డల తల్లి అవాలి అనేది, ఈ ప్రయాసలో ప్రతీ మాతృమూర్తి యొక్క స్వప్నం. దానికి కులమతాలు గానీ, ధనిక, పేద అనే తారతమ్యంగానీ లేదు. పిల్లలు పక్కదారి పట్టి, భవిష్యత్తు ఏం నాశనం చేసుకుంటారో, తను సరిదిద్దలేని, తనకి అలవికాని, ఏ అనుభవాల ముళ్ళరక్కసిలో చిక్కుకుంటారో అని, ప్రతి తల్లి మనసులో ఒక అభద్రతాభావం ఉంటుంది. డబ్బు పోతే సంపాదించవచ్చు, పరువుపోతే మరో మంచిపని చేసి పరువు సంపాదించవచ్చు. ప్రాణంలాటి ఈ పిల్లలకి ఏదయినా జరగరానిది జరిగితే, ప్రాణం పోయినట్లే. ఒక సంతానాన్ని కని పెంచి పెద్ద చేయటానికి 25 సంవత్సరాల సమయం వెచ్చించాలి. దీనికి ఇంకో ఛాన్స్ ఉండదు. అందుకే పిల్లల పట్ల వారి మంచి భవిష్యత్తు పట్ల తలితండ్రులకు అంత పులిపంజా లాటి పొజిసివ్‌నెస్! ఇది తల్లితండ్రులు అయిన వారికే తెలుస్తుంది. కొన్ని సబ్జెక్ట్స్‌కి అవుట్‌డేటెడ్ అనేది ఉండదు. అవి మనిషి మనసులో ఉన్న మూలాలకి దర్పణాలు. అందుకే ఆ ఇతివృత్తాలకి నిరంతర యవ్వనం.

తరాలు మారినాయి. 'మీనా' నవల చదివిన పాఠకుల్లోనూ ఆ మార్పు వచ్చింది. దాదాపు 25 సంవత్సరాల క్రిత, ఒక తల్లీ కూతురు నా దగ్గరకు వచ్చారు. ఆవిడ వెంట 18 సంవత్సరాల కూతురు ఉంది. తల్లి వచ్చినప్పటి నుంచీ మీనా, జీవన తరంగాలు, ఆరాధన, వీటిని తను ఎలా చదివిందో, తన ఫ్రెండ్స్, తనూ ఎలా చర్చించుకున్నారో ధారాళంగా, నన్ను ఒక్క మాట మాట్లాడనీయకుండా చెప్పేస్తోంది. పాపం కూతురు చాలా బోర్ గా దిక్కులు చూస్తూ కూర్చుంది. నేను మధ్యమధ్యలో ఆ అమ్మాయిని మాట్లాడించాలని ప్రయత్నించాను. ఆ అమ్మాయి మాట్లాడలేదు. "ఇదంతే..అస్సలు మాట్లాడదు. అదే నా తలనొప్పి. రేపు పెళ్ళీ అయితే కాపురం ఎలా వెలగబెడుతుందో అని నాకు దిగులు" అనేసిందావిడ.

ఆ అమ్మాయి ముఖంలో రౌద్రం చూసాను. కాసేపు అయింతర్వాతఆ అమ్మాయి " మీ నవలలో కృష్ణవేణమ్మ అచ్చు మా అమ్మ లాటిదే! మీరు మా అమ్మని చూడలేదుగా ఎలా వ్రాసారు" అంది. వాళ్ళమ్మకి చాలా కోపం వచ్చింది. తర్వాత వెళ్ళేవరకూ ఆ అమ్మాయికి లెక్చరు యిస్తూనే వుంది. నాకో సంఘటన గుర్తుండటానికి ఆ అమ్మాయి కసిగా అన్న కామెంట్ కారణం.

చాలా సంవత్సరాలు అయిపోయింది. వాళ్ళముఖాలు కూడా నాకు గుర్తు లేవు. ఏడాది క్రితం ఒకామె వచ్చింది. భర్త డాక్టర్. బాగానే సెటిల్ అయింది. ఒక్కతే కూతురు. ఆవిడ చాలా ఏళ్ళక్రితం వాళ్ళమ్మతో వచ్చిన అమ్మాయినని గుర్తుచేసింది. నేను చాలా సంతోషపడ్డాను. ఆమె అన్న ఒక్కమాటకి చకితిరాలిని అయ్యాను. "ఆరోజు నేను మా అమ్మని తప్పుపట్టి, కృష్ణవేణమ్మ అన్నానుగానీ, ఈరోజు నేను అచ్చు మా అమ్మలాగానే ప్రవర్తిస్తున్నాను. అసలు కృష్ణవేణమ్మలాంటి అమ్మలే 100% కరెక్ట్. మా అమ్మాయి ఫ్యాషన్ టెక్నాలజీ చేస్తోంది. అర్ధరాత్రి పబ్‌లు, ఫ్రెండ్స్ అంటూ తిరుగుతుంటే, నేను కక్కలేక-మింగలేక ఏడుస్తున్నాను. ప్రతి తల్లీ తనకూతురు చదువుకుని లక్షణంగా పెళ్ళిఅయి అత్తవారింటికి వెళ్ళాలని ఎందుకు అనుకుంటుందో యిప్పుడు అర్ధం అవుతోంది నాకు" అంది.





బహుశా 'మీనా' నవల తరాలు గడచినా పునర్ముద్రణకు రావటానికి ఇలా వారి అంతర్యాలని స్పృశించడమే కారణం అనుకుంటాను.

***

# ఆరాధన

**నేను వ్రాసిన సెక్రటరీ, జీవనతరంగాలు,** మీనా, కీర్తికిరీటాలు, జాహ్నవిలాంటి అత్యంత పాఠకుల ఆదరణకు గురి అయిన నవలల వరుసలో ఆరాధన నవల కూడా నిలబడుతుంది. ఆరాధన నేను వ్రాసిన మొట్టమొదటి డైరెక్ట్ నవల. ప్రచురించిన వెంటనే ఏడాదిలో పది ఎడిషన్స్ వచ్చిన నవల.

నేను ఆరాధనకి ముందు అన్ని నవలలు, వార, మాస పత్రికల్లో సీరియల్స్ వ్రాసేదాన్ని. సీరియల్ పూర్తి అయిన తర్వాత ప్రచురణకర్తలు - నవలలుగా వేసేవారు. వారు ప్రచురణ ప్రారంభించేసరికే, ఆనవలలకి ఆర్డర్స్ ఉండేవని ప్రచురణ కర్తలు చెప్పేవారు. స్త్రీలు బుక్ షాప్స్‌కి వచ్చి నవలలు కొనేవాళ్ళు. అప్పటికి - శేషాచలం అండ్ కంపెనీ అధినేత అయిన ఎమ్.ఎన్.రావుగారు 'ఇంటింటా గ్రంధాలయం' అనే ప్రణాళికలో, ఆంధ్రదేశంలో ఒక సాహితీ విప్లవం తెచ్చారు. ఆయన అది ప్రారంభించినప్పటి నుంచీ నన్ను నవల వ్రాయమని అడుగుతూనే ఉన్నారు. వారు నెలకి ఒక నవల రిలీజ్ చేసేవారు. బుక్‌క్లబ్ మెంబర్స్‌కి మాత్రమే ఆ నవల దొరికేది. మెంబర్స్ కూడా బాగానే జాయిన్ అయ్యారు. నేను ఎమ్.ఎన్.రావుగారి రిక్వెస్ట్‌ని లక్ష్యపెట్టలేదు. విముఖత చూపాను. ఎందుకంటే నా నవలలు పెద్ద కాన్వాస్ గలవి, ఎన్నో పేజీలు. దాదాపు రెండు భాగాలు. ఎమెస్కో వారి నవలలు పాకెట్ సైజువి. పేజీలు పరిమితం. నాకు ఆ పుస్తకం సైజు నచ్చలేదు. అప్పటికే మీనా, జీవనతరంగాలు, సెక్రటరీ నవలలు అమ్మకాల్లో పి.టి ఉషలా పరుగుదీస్తున్నాయి. ఎమెస్కోవారివి చిన్న నవలలు. తక్కువ ధరలు. నాకు పారితోషకం ఎక్కువ తీసుకునే అలవాటుంది. అదీ గాక, నేను అప్పటికే కమిట్ అయిన వారపత్రికల నవలలతో, సినిమా కథలతో ఊపిరాడనంత బిజీగా ఉన్నాను. ఎమ్.ఎన్.రావుగారు పట్టుదలగా నా నవల కోసం, నాకు నచ్చచెప్పటానికి గట్టి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. వారి




అమ్మాయిలు, ముఖ్యంగా రెండో అమ్మాయి మీనా నాకు స్నేహితురాలు అయిపోయింది. ఎమ్.ఎన్.రావుగారు చాలా సహృదయులు. తెలుగు సాహిత్యాన్ని పాఠకుల దగ్గరికి తీసుకువెళ్ళాలనే ఆయన ఆశయంలో నిజాయితీ నాకు అర్థమైంది. కేవలం ఆయన కోసం నేను నవల వ్రాస్తానని అంగీకరించాను. అదే ఆరాధన నవల. చిన్న నవల వ్రాయడం అప్పట్లో నాకు కష్టమే అయింది. ఆరాధన 12 రోజులలో వ్రాసినట్టు నాకు గుర్తు. ఆరాధన మళ్ళీ పి.టి.ఉషలాగ పరుగు ప్రారంభించింది. పునర్ముద్రణ మీద పునర్ముద్రణ! పాఠకులు నన్ను వారి ఆనంద, ప్రశంసలతో ముంచెత్తేశారు. పోస్ట్‌మాన్ కట్టలు కట్టలు ఉత్తరాలు తెచ్చిపడేసేవాడు.

ఆరాధనకి ఇతివృత్తం కూడా హఠాత్తుగా మదిలో మెదిలినదే! ఒకసారి గేటు దగ్గరకి అడుక్కోవడానికి ఒక భిక్షకురాలు
వచ్చింది. వెంట ఎనిమిది సంవత్సరాల పిల్ల ఉంది. ఆ పిల్ల మూగది. తల్లి దానికి మాటరాదని తెలిసి చంపేద్దామని అనుకుందిట. ఆమె అన్నగారు

తెచ్చి ఆ పిల్లని సంవత్సరంపాటు తీసుకెళ్ళి ఆలనాపాలనా చూసొట్ట. తల్లికి కూతురు మీద ప్రేమ వచ్చేసింది. తిరిగి తెచ్చుకుంది. 'ముసలితనంలో పనికి వస్తుందిగదమ్మా!' అంది. ఆ పిల్ల తనకి వచ్చిన ఆపదేమిటో తెలియనట్టుగా మా దొడ్లో పూలమొక్కలు చూస్తూ సైగతో పువ్వు ఇవ్వమని అడిగింది. నేను గులాబి కోసి ఇస్తే కాదని మందారపువ్వు చూపించింది. నాకు ఆ తల్లీ కూతుళ్ళను చూస్తే జాలేసింది. ఆ మూగ పిల్ల పెద్దయిన కొద్దీ కష్టాలే ఎదురవుతాయి అనిపించింది. ఈ ప్రపంచంలో స్త్రీ పడే కష్టాలు, పురుషుడు ఎప్పుడూ పడడేమో! అసలే ఈ ప్రపంచం ఆడవారికి ఒక అంబులపొద. అందులో మూగ, చెవిటి, గుడ్డిలాంటి అవకరం ఉంటే ఇంకెన్ని బాధలో! నన్ను మందారపువ్వు అడిగిన ఆ చింపిరిజుట్టు చిన్నపిల్లే ఆరాధనలో 'అన్నపూర్ణ'. ఒకసారి ఈ నవల చదివితే, అన్నపూర్ణని మరచిపోలేం అని చాలామంది పాఠకులు అన్నారు.

ఈ నవల చదివిన తరువాత నా దగ్గరకి ఆ వంకరతో పుట్టిన పిల్లలతో బాధలు పడుతున్న తల్లులు చాలామంది నన్ను వెతుక్కుంటూ వచ్చేవారు. నేను ఎంత బిజీగా ఉన్నా పాఠకులు వచ్చినప్పుడు మాత్రం నవల వ్రాయడం మధ్యలో ఉన్నాసరే అది ఆపేసి, వచ్చి వారితో మాట్లాడి సమయం గడిపేదాన్ని. ఆరాధన చదివి వచ్చిన తల్లులకు ఒక్కటే చెప్పేదాన్ని! మామూలు పిల్లలు - తల్లిదండ్రులకి వారి మధ్య ఉన్న ఋణానుబంధం తక్కువ, మీలాంటివారికి ఎక్కువ. అశక్తులయిన మీ పిల్లలకు మీరు తల్లేకాదు, గురువు - దైవం, స్నేహితులు కూడా కావాలి. మీరే వారి ప్రపంచం అవ్వాలి. మీరే నిస్సహాయులు అయితే, వారికి దిక్కెవ్వరు?

ఒకసారి రేడియోలో ఇంటర్వ్యూలో కూడా అదే చెప్పాను. ఆరాధన వ్రాసి దాదాపు 30 సంవత్సరాలు దాటింది. మా అమ్మాయి పెళ్ళి అయిన తర్వాత మా పెద్ద ఇల్లు వదిలేసి మేం చిన్న ఇంట్లోకి వచ్చేశాం. మా ఇంటి కెదురుగా ఫ్లాట్స్ ఉన్నాయి.

అయిదు సంవత్సరాల క్రితం ఒక రోజు ఆ ఇంట్లో ఉన్న ఒకామె కూతురుని వెంటపెట్టుకుని మా ఇంటికి వచ్చింది. అమ్మాయికి పాతిక సంవత్సరాలు పైనే ఉంటాయి. ఆరోగ్యంతో, పుష్టిగా, పెద్దజడతో, కళకళలాడే నిర్మలమైన కళ్ళతో అచ్చు బాపు బొమ్మలా ఉంది. తల్లి తనని పరిచయం చేసుకుని, తనరెండో కూతురుని అమ్మాయిని పరిచయం చేసింది. 'పేరేమిటి?'' ఆ అమ్మాయిని అడిగాను. ఆ అమ్మాయి తల్లివైపు చూసింది. 'మాటలు రావు, పేరు అన్నపూర్ణ' అంది. నేను చకితురాలినయ్యాను. నాకు ఆటైములో ఆరాధన గుర్తుకు రాలేదు. ఇంత అందమైన అమ్మాయికి మాట్లాడలేని అశక్తతా అనిపించింది. ఆ అమ్మాయి ముఖంలో నన్ను చూస్తుంటే సంతోషం ఉప్పొంగి పోయింది. బహుశా నా గురించి వాళ్ళమ్మ చెప్పిందేమో! ఆ అమ్మాయి తల్లికి సైగ చేసింది. తల్లి చెప్పింది 'మీ ఆరాధన నవలంటే చాలా ఇష్టం, ఆ పుస్తకం దాచుకుంటుంది, చాలాసార్లు చదివింది' అంది.

నేను ఆశ్చర్యపోయాను. 'చదవగలదా?' అన్నాను. అప్పుడు తల్లి చెప్పింది. 'వినికిడి సమస్య కొద్దిగానే ఉంది. వైద్యంతో తగ్గింది. నేనే అక్షరాలు నేర్పాను, పుస్తకాలు చదవడం నేర్పాను. మొదట్లో నేర్పడానికి నేను, నేర్చుకోవడానికి తనూ చాలా కష్టపడ్డాం. ఘర్షణలు కూడా అయినాయి. కానీ చదువు నేర్చుకున్న కొద్దీ అవి తగ్గిపోయాయి' అంది.

నేను సంభ్రమాశ్చర్యాలతో ఇద్దరినీ చూశాను. ఆ అమ్మాయి నా దగ్గరికి వచ్చేసింది. నా చేయి పట్టుకుంది. ఆ తర్వాత ఉన్నంతసేపూ నా చేయి గట్టిగా పట్టుకుని, నా పక్కనే కూర్చుంది. మా ఎదురుగా ఫ్లాట్స్‌లో ఆవిడ పెద్దకూతురు దగ్గరకు వచ్చారుట. రాజమండ్రి దగ్గర ఒక పల్లెటూరు స్వగ్రామమంట. చాలా కబుర్లు చెప్పారు. ఆ అమ్మాయికి 30 ఏళ్ళట. ''పెళ్ళి అవడం లేదు. నా తర్వాత ఈ పిల్లని ఎవరుచూస్తారు? అదే నాకు దిగులు'' అని ఆవిడ ఏడ్చేసింది. నేను

అన్నపూర్ణ చేయిపట్టుకుని అన్నాను. 'లేదు, లేదు మీరు బాధపడకండి. మీ అమ్మాయికి పెళ్ళి అవుతుంది. లక్షణంగా కాపురం చేసుకోవడం మీరు చూస్తారు' అన్నాను. మీ నోటిమాట నిజం అవాలి అంది ఆవిడ దణ్ణం పెడుతూ.

వాళ్ళు వెళ్ళిపోతుండగా ఆ అమ్మాయి హఠాత్తుగా వెనక్కి వచ్చి వీడ్కోలుగా నా చేయి గట్టిగా పట్టుకుంది. నేను నమ్మకంగా అన్నాను, 'నీకు పెళ్ళిఅవుతుంది, మళ్ళీ నాదగ్గరకి వస్తావు' అన్నాను. ఆ అమ్మాయి హఠాత్తుగా నన్ను కౌగిలించేసుకుంది. పసిపిల్లలా నన్ను పట్టుకుని వెళ్ళలేదు. తల్లి 'వెళ్దాం రా' అంది. అన్నపూర్ణ నన్ను వదిలేసి, నీళ్ళు నిండిన కళ్ళతోనే నవ్వేసింది. ఆ నవ్వే ఆ అమ్మాయికి ఆభరణం అని నాకు  చూసినప్పుడే అర్థం అయింది. వాళ్ళు వెళ్ళిపోయారు.

క్రిందటి ఏడాది మళ్ళీ తల్లీ కూతుళ్ళిద్దరూ వచ్చారు. అన్నపూర్ణకి పెళ్ళి అయింది. వాళ్ళ ఊరిలోనే భార్యపోయి, ఇద్దరు పిల్లలు ఉన్న ఒకతను పెళ్ళిచేసుకున్నాడు. అతను చాలా మంచివాడు. అన్నపూర్ణని ప్రేమగా చూస్తాడు. అన్నపూర్ణకి కొడుకు పుట్టాడు. వాడికి మాటలు వచ్చాయి. అన్నపూర్ణ ముఖంలో కన్పించిన ఆనందం నేను మరువలేను. ఈ అనుభవం కూడా నా జన్మలో మర్చిపోలేను. రచయిత్రిగా ఒక పాఠకురాలితో ఈ అనుభవం నాకు చాలా అపురూపమైనది.

ఎమ్.ఎన్.రావుగారు ఆ ఒక్క నవలే వేశారు. తర్వాత ఆయన పోయారు. కానీ ఎమెస్కోలో నా డైరక్ట్ నవలల ప్రహసనం ఆగలేదు. ఎమ్.ఎన్.రావుగారి అబ్బాయి రఘు ప్రచురణకర్తగా వచ్చాడు. నేను చాలా  సంవత్సరాల వరకూ ప్రతి ఏడాది ఏప్రిల్ మొదటివారంలో నా డైరక్ట్ నవల ఎమెస్కో ద్వారా రిలీజ్ అయేట్టు వ్రాశాను. పాఠకులు వారపత్రికల్లో సీరియల్స్ కంటే డైరక్ట్ నవలలకే ప్రాధాన్యం ఇవ్వసాగారు. ఎమెస్కోవారు రికార్డు స్థాయిలో అభిశాపం నవల అమ్మి నాకు అత్యంత అధికమైన పారితోషకం ఇవ్వసాగారు. ఆ విధంగా 'ఆరాధన' నవల, డైరక్ట్ నవల వ్రాయడానికి తొలిమెట్టు అయింది. తర్వాత తర్వాత రచయిత్రిగా నాకు, ప్రచురణకర్తలకి – పాఠకులకి కూడా డైరక్ట్ నవలలే ప్రాధాన్యత అయిపోయింది. ఆరాధన ఆ విధంగా నా రచనా జీవితంలో అందమైన మైలురాయి. నా ఆరాధనలో 'అన్నపూర్ణ'కి మూలధాతువు అయిన, ఆ భిక్షురాలి కూతురు, మందారపువ్వు అడిగిన ఆ మూగపిల్లని నేను మర్చిపోలేదు. నా YSR Foundation ద్వారా గుడ్డి, మూగ, కుంటి ఆడపిల్లలకి ఏదయినా సాయం చేయడానికి ప్రయత్నిస్తున్నాను.

***

# ఈ దేశం మాకేమిచ్చింది?

ఈ నవల వ్రాసేటప్పుడు నా వయసు 27 సంవత్సరాలు వుండి వుంటుంది. సహజంగా ఆ వయసులో వున్నవారు కొన్ని విషయాల్లోతీవ్రంగా స్పందించినట్లే నేనూ స్పందించేదాన్ని.ఈ నవల ప్రేరణకి మూల ధాతువు, దాదాపు నా వయసే వున్న ముగ్గురు ఇంజినీర్లు, ఒక డాక్టరు. వాళ్ళు స్నేహితులు, నిరుద్యోగులు. నలుగురూ కలిసి ఒకరోజు సాయంత్రం నన్ను చూడడానికి మా ఇంటికి వచ్చారు. అప్పటికే నేను సెక్రటరీ , జీవనతరంగాలు, మీనా లాంటి నవలలతోనూ మనుషులూ-మమతలూ, ఆత్మీయులు లాంటి సినిమాలతోనూ ఆంధ్రప్రదేశ్ అంతా అసంఖ్యాక అభిమాన పాఠకులతో పేరుప్రతిష్టలు పొందాను.

అందరూ ఏమిటీ సక్సెస్ అంటు కుతూహలంగా నన్ను చూడడానికి వచ్చినట్టే, ఈ నలుగురూ వచ్చారు. వాళ్ళు చదువులు పూర్తి అయి, వుద్యోగాలు లేక నిస్పృహతో వున్నారు. అప్పటికే పెళ్ళిళ్ళు అయి పిల్లలు కూడా వున్నారు. ఇద్దరు ఇంజినీర్స్-డాక్టరు భార్యా పిల్లలతో తల్లిదండ్రులమీద ఆధారపడితే , ఒక ఇంజినీర్ అత్త ,మామల మీద ఆ-ధారపడ్డారు. వాళ్ళలో ఉద్యోగాలు పొందలేని నిస్సహాయత-నిస్పృహ బాగా కనిపిస్తోంది. అమెరికాలో తెలిసిన వాళ్ళున్నారట.అక్కడికి వెళ్ళిపోవడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే వెళ్ళిపోతారట. మా మధ్య సంభాషణ సీరియస్‌గా మారింది.

అప్పుడప్పుడే అమెరికాకి మన మేధావుల వలస మొదలైంది. అంతక్రితం రెండురోజుల క్రితం కూడా ఒకతను భార్యతో కలిసి వచ్చాడు. అతను అమెరికా వెళ్ళి పోతున్నాడు. స్థిరపడిన తరువాత వచ్చి భార్యని పిల్లల్ని తీసుకువెళ్తాడట. ఆవిడని కదిపితే కన్నీళ్ళు వచ్చేస్తున్నాయి. ఈ రోజు వీళ్ళు కూడా అదే చెబుతున్నారు. నేను కొంచెం ఎమోషనల్‌గానే ఇంజినీర్స్‌ని అడిగేసాను. "మీలాంటి సమర్థులు మంచివాళ్ళు ఇలా వెళ్ళిపోతే ఈ దేశం ఏం కావాలి? మా లాంటి వాళ్ళ గతేమిటి?"

వాళ్ళు చాలా సీరియస్ అయ్యారు. ఒకతనైతే చాలా ఎమోషనల్‌గా నాకు జవాబు ఇచ్చాడు. 'ముందు మనిషిగా బ్రతకాలి కదండీ! మేం కృంగిపోకుండా, పిచ్చివాళ్ళం అవకుండా మా భార్యలు ఆత్మహత్యలు గురించి - ఆలోచించకుండా వుండాలి. మేం ఆకలికి నకనకలాడకుండ బ్రతికినప్పుడే ఇంక దేని గురించైనా ఆలోచించగలం. ఈ దేశాన్ని మేం రక్షించు కోవాలి నిజమే!కానీ మమ్మల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత యీ దేశానికి కూడా వుంది కదా! నేను ఉద్యోగానికి అప్లైచేశాను. వస్తుందని, మా కష్టాలు తీరుతాయి అని చాలా ఆశపడ్డాను. నాకు రాలేదు.
నాకంటే ఇన్ఫీరియర్ కాండిడేట్ రికమండేషన్‌తో వుద్యోగం కొట్టేసాడు.'

నేను జవాబు చెప్పలేకపోయాను. నాకు వారి ఆవేదన అర్థం అయింది. వాళ్ళని నేనెప్పుడూ చూడలేదు. వారు కూడా నన్ను చూడలేదు. వీడ్కోలు తీసుకుంటుంటే మా మధ్య ఒక ఆత్మీయత బంధం ఏర్పడినట్టే అనిపించింది.

కొద్ది రోజుల తర్వాత ఇంకో సంఘటన జరిగింది.

ఒక పోలీసు ఉద్యోగి భార్య నా దగ్గరికి వచ్చింది. ఆమె భర్త డ్యూటీ ప్రాణంగా చేసే అతనే.

ఒకసారి జరిగిన గొడవల్లో మాబ్‌ని కంట్రోల్ చేయబోయి వాళ్ళచే తర్వాత దెబ్బలు తగిలి మరణించాడు. ఈమెకు మూడేళ్ళూ-ఏడాది గల ఇద్దరు పిల్లలు. తల్లిదండ్రులు లేరు. అత్తమామలు ఇంట్లోంచి తరిమివేసారు. ఒక

ఫ్రెండ్ తాత్కాలికంగా ఆశ్రయమిచ్చింది. ఈమె నా పేరు విని ఆర్థికసాయం ఏమైనా చేస్తానేమో అని వచ్చింది. వెంట వచ్చిన ఫ్రెండ్, ఆమె ఎంత అభిమానవతో చెప్పింది. కట్టుకోవటానికి సరైన చీరలుకూడా లేవు. నేను 200 రూపాయలు ఇచ్చాను. పాతవి కొన్ని చీరలు ఇచ్చాను. కానీ అది ఏ మూలకి? దరిద్రాగ్నిలో వున్న ఆమెకి నా సాయం ఒక నీటితుంపరంత కూడా కాదని నాకు తెలుసు.

నిస్పృహతో దేశం వదలి వెళ్ళిపోతున్న నలుగురు యువకులని, భర్త విధి నిర్వహణలో మరణిస్తే సరైన సహాయం అందక, ఆకలితో దరిద్రంతో మగ్గుతూ, ఇద్దరు పిల్లల్ని పెంచాల్సిన బాధ్యతతో నిస్సహాయురాలిగా వున్న యీ యువతిని చూసాను. అప్పటికీ నా చుట్టూ సంఘంలో ఎంతోమంది స్వార్థపరుల్ని , మౌనంగా చిత్రహింసలు పడే మంచివాళ్ళనీ చూసాను. అవీ ఇవీ కలబోసిన సంఘటనలతో, నాటు వేస్తే పెరిగిన చెట్టే 'ఈ దేశం మాకేమిచ్చింది'.

ఈ నవల టైటిల్ వినగానే అందరూ నెగిటివ్ టైటిల్ అని నన్ను తూర్పార పట్టారు. వీరెవరూ నా నవలలో ఒక్కపేజీకూడా చదవలేదని నాకర్థం అయింది. ఏ సాకు దొరుకుతుందా నన్ను విమర్శించుదామా అని డేగకళ్ళతో చూసే వర్గం. ఇందులో రెండు ఉత్తరాలు మీముందు ఉంచుతాను

*ఇది రామకృష్ణ అనే అతను పుస్తకంలో హీరోయిన్ అయిన బిందుమాధవికి వ్రాస్తాడు.(పేజీ 279-280)*

అక్కా,

నేను ఢిల్లీ నుంచి నిన్ననే తిరిగి వచ్చాను . బావగారు వుద్యోగం రిజైన్ చేసినట్టు, మీరంతా పల్లెటూరు వెళ్ళిపోయినట్టూ తెలిసింది.నేను చాలా ఆశ్చర్యపోయాను. బావగారు వుద్యోగం రిజైన్ చెయ్యడమా? ఇదేదో ప్రపంచపు వింతలా వుంది. నువ్వెలా వున్నావు? పిల్లలెలా వున్నారు ? నేను ఒక్కసారి వద్దామనుకున్నాను. కానీ టైమ్ లేకపోయింది అక్కా! నేను అమెరికా వెళ్ళి పోతున్నాను. బహుశా ఇప్పట్లో రానేమో! ఇక్కడ ఎంత ప్రయత్నించినా, నాకు ఉద్యోగమే దొరకలేదు. నాకు రీసెర్చి చేయాలని ఉంది.నాకు సిరులు-సంపదలు భోగాలు వద్దు. ఒక లేబొరేటరీ, దాంట్లో నాకు కావలసిన పరికరాలు, బన్ చాలు. యింతే! నేను,నా ప్రపంచంలో మునిగిపోగలను. ఒక ఫ్రెండ్ ద్వారా ప్రయత్నించాను. అమెరికాలో , నాకు ఉద్యోగంతో పాటు రీసెర్చి చేసే అవకాశం కూడా వారు కల్పిస్తారట. ఇక్కడ తింటానికి తిండే దొరకని నేను, రీసెర్చి చేయడమా!? మనదేశం విడిచి వెళ్ళటం నా కేమాత్రం యిష్టం లేదు. కానీ ఏం చెయ్యను.

ఈ దేశంలో పస్తులు పడుకుని, అనామకంగా ఆకలి చావు చచ్చేకంటే, పరాయిదేశం వెళ్ళి, అక్కడ మంచి పేరు తెచ్చుకుని, ఫలానా రామకృష్ణ ఇండియన్ అంటూ మనదేశానికి ఒక అత్యుత్తమ గౌరవం తీసుకురావడం నయం కదూ! అందుకే వెళ్ళిపోతున్నాను అక్కా! నీకు తెలుసా? శశి హాస్పిటల్లో వున్నాడు . కిడ్నీస్ చెడిపోయినాయిట. వాడి ఆరోగ్యం బాగా పాడయిపోయింది. వాడు ఎంత తెలివిగలవాడు! చక్రవర్తి పిడికిలిలో బిగిసి సర్వనాశనం అయాడు . ఉజ్వల భవిష్యత్తు ఉందని, దేశానికి ఎంతో చేస్తాడని మనం అనుకున్న అతను కుక్క మూతిపిందెలా రాలిపోతున్నాడు. నీకు తెలుసా! రఫీ దుబాయ్ వెళ్ళి పోతున్నాడు . అక్కడా బాగుందిట. యిక తిరిగి రాడుట! జాన్ మిషనరీలో చేరి ఆఫ్రికా వెళ్ళిపోయాడు. ఏమిటో కాలేజీలో చదివేటప్పుడు కలిసి వుండి ఎన్నెన్నో సాధిద్దామని అనుకునే వాళ్ళం. ఇప్పుడు చెట్టుకో పిట్టలా విడిపోయాం.. అక్కా! వెంటనే జవాబు వ్రాయువు! బావగారిని అడిగానట్టు చెప్పు. అమెరికా వెళ్ళి స్థిరపడ గానే, మొట్టమొదటి ఉత్తరం నీకే వ్రాస్తాను. రమని నేనే పెళ్ళి చేసుకుంటాను. వేరే సంబంధాలు చూడవద్దు. ఇట్లు

*నీ*

**రామకృష్ణ**

*దానికి బిందుమాధవి వ్రాసిన జవాబు (పేజీ 281)*

రామూ!

నువ్వు వ్రాసిన ఉత్తరం అందింది. నాకు సంతోషం కంటే, బాధే ఎక్కువగా అని పించింది. ఎందుకంటే నువ్వు వెళ్ళిపోతున్నావు!

నీకు కావల్సింది ఇక్కడ దొరకక, విసిగి, దూరంగా వెళ్ళిపోతున్నావు! ఇలా మనదేశం నుంచి ఎందరో వెళ్ళిపోతున్నారు. నాకు మరీ మరీ అనిపిస్తోంది. సమర్ధుల్ని ,మంచి వాళ్ళని, ఈ దేశం ఇలా దూరం చేసుకుంటోందేమిటి? ఎంతో మంది సైంటిస్టులు, ఎంతో మంది డాక్టర్లు, ప్రతిభ గలవారు ఈ దేశం వదిలి వెళ్ళిపోతుంటే ఇక్కడ అసమర్ధతకి, అరాచకానికీ పట్టాభిషేకం జరుగుతోంది.! రామకృష్ణా నీలాంటి ప్రతిభావంతులు ఎప్పుడూ "ఈ దేశం మాకేమిచ్చింది?" అని ప్రశ్నించుకోకండి! ఈ దేశానికి నేను 'ఏమి ఇవ్వగలను?" అని ఆ లోచన చేయండి. మీరు ఎన్ని అవకాశాలకోసం ఈ గడ్డని వదిలి వెళ్ళినా, మళ్ళీ తిరిగి రండి. ఎందుకంటే నాలాటి తోబుట్టువుల, తల్లుల , పిల్లల, వృద్ధుల నిశ్చింత , శాంతి మీలాంటి మంచివాళ్ళ మీద, సమర్ధులమీదనే ఆధారపడి వుంది. మీరు విసిగి పోయి యీ దేశాన్ని స్వార్థపరుల చేతులకి అప్పగించకండి! ఇది నా అభ్యర్ధన! ఈ విన్నపం నా ఒక్క దానిదీ కాదు. నా లాంటి నిస్సహాయులైన అనేక వేలమంది అభ్యర్ధన ఇది..

రామకృష్ణా నువ్వు తిరిగి రా! తిరిగి రావటానికే వెళ్తున్నాని అనుకో! రమ నీ భార్యే! దాన్ని నీకు తగిన భార్యగా, ఉత్తమ గృహిణిగా నాకు చాతనైనంతగా తీర్చి దిద్దుతాను.

*సకల ఆశీస్సులతో*

*నీ సోదరి*

*బిందుమాధవి*

ఈ నవలలో హీరో ప్రభు నిజాయితీగల ఒక పోలీస్ ఆఫీసర్. ఇతని భార్య బిందుమాధవి హీరోయిన్. ఈమె రచయిత్రి.వీరిద్దరి అన్యోన్య దాంపత్యంతో, ప్రేమతో అల్లుకున్న పొదరిల్లు లాంటిది వారి కుటుంబం. రత్నాల్లాంటి ముగ్గురు పిల్లలు. వృత్తిపరంగా అతను కఠోరదీక్షగా భావించే అతని కర్తవ్యనిష్టకి, ప్రశాంతంగా వుండే అతని వ్యక్తిగత జీవితం ఎన్నో భయంకరమైన తుఫాన్లకి గురవుతుంది. భార్యాభర్తలిద్దరూ ఒకరిపట్ల ఒకరు పరస్పర నమ్మకంతో, ప్రేమతో, దేశం పట్ల వారి బాధ్యతతో, జీవితంలో ఎదురైన కష్టాలని మోసాలని, ఎలా తట్టుకుని నిలబడ్డారో వివరించే నవల యిది.

ఈ నవల స్వాతి మాసపత్రికలో సీరియల్‌గా వచ్చింది. ప్రారంభ సంచిక నుండే , చాలా బాగుందని , నా మొదటి నవలలకి, పూర్తిగా భిన్నంగా వుందని, ప్రశంసల జల్లు కురిపించారు. నాకు కొత్త పాఠక వర్గం చేరువయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత 'కౌముది' కోసం ప్రత్యేకంగా వ్రాస్తున్న యీ సిరీస్‌లో ఈ నవలని చేతుల్లోకి తీసుకుంటే చిత్రంగా, నా గుండెలు అప్పుడంత తీవ్రంగానూ స్పందించాయి. ఇన్ని సంవత్సరాలలో, రచనా వ్యాసంగంలో సుదీర్ఘమైన పయనంలో నేను చాలా ముందుకే వచ్చేసాను. కొన్ని కొన్ని నవలలు దాదాపుగా , వాటి యితివృత్తాలే తప్ప – వివరాలు గుర్తు రానంతగాఅయిపోతున్నాయి. ఈ నవల ఎవరైనా గుర్తు చేసినప్పుడల్లా నాకు నలుగురు ఇంజినీర్స్ – పోలీస్ భార్య –పిల్లలు వారే గుర్తుకు వస్తారు. వారిని గురించిన జ్ఞాపకాలే తప్ప, వారి ముఖాలు కూడా నాకు యిప్పుడు గుర్తు లేవు.

ప్రియ సోదరుల్లారా! మీరెక్కడున్నారో నాకు తెలియదు. బహుశా, మీకు కూడా నాలాగానే, ఈ జ్ఞాపకం చెదిరిపోయి వుండవచ్చు. సాయంత్రం మీతో జరిపిన ఈ సంభాషణ వల్ల ఒక మంచి నవలకి పునాది మీద్వారా మాకు లభించింది. మీకు మా మనఃపూర్వకమైన కృతజ్ఞతలు .

చాలా తక్కువమంది, చాలా మంచి నవల అని మెచ్చుకునే నవల యిది. నిజంగా, నాకు కీర్తికిరీటమే..

క్రిందటి సంవత్సరం, రాష్ట్ర ప్రభుత్వ సంగీత , నృత్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి నెమలికంటి సువర్ణలత వారి కాలేజి వార్షికోత్సవానికి , నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తే వెళ్ళాను. నాతో బాటు , ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులుగా వున్న ఒక ఐ.పి.ఎస్ ఆఫీసర్ , ఒక పోలీసు అధికారికూడా ప్రత్యేక అతిథులుగా వచ్చారు . ప్రోగ్రామ్స్ మధ్య - మళ్ళీ డాన్స్ ప్రోగ్రామ్ ప్రారంభం అయే విరామ సమయంలో సువర్ణలత గారు, తన ఛాంబర్‌లో మాకు టీ ఏర్పాటు చేసారు. అంతకుముందే మమ్మల్ని ఒకరిని ఒకరికి పరిచయం చేసారామె. మేం టీ తాగుతుండగా పోలీస్ అధికారి, ఆయనకి 50 సం. వయసు వుండవచ్చు, ఆజానుబాహువు, ముఖం సీరియస్ గా వుంది.

ఆయన నా దగ్గరికి వచ్చారు. తగ్గు స్వరంలో "మీ ఈ దేశం మాకేమిచ్చింది నవల చాలా ఇష్టం. నన్ను చాలా ఇన్‌స్పైర్ చేసింది" అన్నారు. నేను చకితురాలనయ్యాను. అందరూ ఎక్కువగా సెక్రటరీ, జీవన తరంగాలు, మీనా , కీర్తికిరీటాలు, ఆరాధన చెబుతుంటారు. ఆ క్షణంలో నాకు చాలా సంతోషంగా

అనిపించింది. ఒక ఉన్నత పదవిలో వున్న ఒక పోలీసు అధికారి ఈ నవల గురించి ప్రస్తావించటం, అది తనని ఇన్‌స్పైర్ చేసిందని చెప్పటం, రచయిత్రిగా నాకూ అనిర్వచనీయమైన అనుభవమే..

రెండు వారాల క్రిందట యింకో సంఘటన జరిగింది. ఒక అమ్మాయి నా దగ్గరకి వచ్చింది. ఆమెకి నా నవలలు అన్నింటిలో 'అమర హృదయం', ' ఈ దేశం మాకేమిచ్చింది' ఈ రెండూ చాలా ఇష్టంట. చాలా సార్లు చదివిందట. ఆ అమ్మాయికి ఇంకా పెళ్ళికాలేదు. ఎం.బి.ఎ పాసయిందిట. సాంప్రదాయం అయినాపెళ్ళే చేసుకుంటుందిట! కానీ, తల్లి తండ్రులు ఎన్నిక చేసిన వ్యక్తిని కాదు, తను ఎన్నుకుని తల్లి దండ్రులకి చెప్పి వారిని ఒప్పించి చేసుకుంటుందిట! అమ్మాయిది సాధారణమైన రూపం. అయినా అసాధారణమైన వ్యక్తిత్వం వుందని, ఆమె కూర్చున్న తీరులో, ముఖంలో వెల్లి విరుస్తున్న చురుకుదనంలో నేను గ్రహించాను. నేను అందరు పెళ్ళికాని పిల్లల్ని అడిగి గినట్టే "ఎలాంటి అబ్బాయి కావాలని అనుకుంటున్నారు" అని అడిగాను .

" మీ ఈ దేశం మాకిచ్చిందిలో ప్రభులాంటి వాడు, పోలీసు డిపార్ట్‌మెంటులో వున్న వ్యక్తిని చేసుకుంటాను" అంది. నేను తెల్లబోయాను.

సహజంగా యీ మధ్య ఏ ఆడపిల్లని కదిపినా వెంటనే ఇంజినీరో, డాక్టరో కావాలంటున్నారు. ఈ అమ్మాయి పూర్తిగా భిన్నంగా వుంది. అమ్మాయి స్పష్టంగా చెప్పింది.

"మా వాళ్ళ కుటుంబాల్లో, చాలా మంది అమెరికాలో సెటిలయ్యారు. అక్కడనుంచీ నాకు చాలా మంచి సంబంధాలే వచ్చాయి. మా అమ్మా నాన్నలకి నేను ఇండియా వదిలి వెళ్ళనని ఖచ్చితంగా చెప్పాను. పోలీస్ డిపార్ట్‌మెంట్లో పనిచేయటానికి యిష్టపడే వ్యక్తి నాకు కావాలని కూడా చెప్పాను"

"ఎందుకని?" అడిగాను.

"మనదేశానికి వాళ్ళ అవసరం చాలా వుంది. అలాంటి నిజాయితీ గల అఫీసర్‌కి, జీవితంలో మనశ్శాంతి ఇచ్చే లైఫ్‌మేట్ గా వుండటం నాకు చాలా ఇష్టం. అంతేగాదు నాకు చిన్నప్పటి నుంచీ

సోషల్ సర్వీస్ అంటే చాలా ఇష్టం. స్లమ్ ఏరియాస్‌లో పిల్లలకి చదువునేర్పుతాను. వాళ్ళందరినీ పెద్దయింతర్వాత పోలీస్ డిపార్ట్ మెంట్‌లో చేరే చదువులకి వెళ్ళాలని చెబుతాను. ఈ దేశంలో
అసలు స్లమ్ ఏరియాస్ అనేవి వుండకూడదని నా ఆలోచన. అప్పుడే మనదేశం నిజంగా బాగుపడ్డట్టు.."

ఆ అమ్మాయిని నేను సంభ్రమాశ్చర్యాలతో చూసాను. ఆ క్షణంలో అమ్మాయిని అక్కున చేర్చుకోవాలని నాకెంతగానో అని పించింది. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. తర్వాత కూడా నేను ఆమె గురించే ఆలోచించాను.

అమ్మాయికి స్వతహాగా స్థిరమైన అభిప్రాయాలున్నట్టున్నాయి. నా నవల బహుశా ఆమెకి తను చూడాలనుకున్న లక్ష్యానికి ఒక దర్పణం అయిందేమో..! నూతన తరంగా ఆవిర్భవిస్తున్న వాళ్ళలో ప్రతిభ వుంది. నిర్దుష్టమైన లక్షణాలున్నాయి. వీరు మౌనంగా దేశాన్ని అభివృద్ధి వైపు తప్పక తీసుకెళ్తారు. మేధావులు అయిన వీరి చేతుల్లో మనదేశం కళకళాలాడుతుంది అని నమ్మకం నాకు వీరిపట్ల కలుగుతోంది. ఈ తరం యువతీ యువకులు, నా నవలలు చదవడం, నన్ను వెతుక్కుంటూ రావటం, నాకు నిజంగా చాలా ఆనందంగా అనిపిస్తోంది.

నా 27 సంవత్సరాల వయసులో నేను "ఈ దేశం మాకేమిచ్చింది?" వ్రాసినప్పుడు యువత నిస్పృహతో, ఉద్యోగాలవేటలో విదేశాలు వెళ్ళే వలస మొదలైంది. దాదాపు 40 సంవత్సరాల తర్వాత,ఇప్పుడు మనదేశ భవిష్యత్తు చిత్రపటం పూర్తి గా మారిపోయింది. యువతకి వారి ముంగిట్లోకే వచ్చి వాలుతున్న ఎన్నెన్నో అవకాశాలు, వారు ఎక్కడకీ భుక్తికోసం వెళ్ళనవసరం లేదు. వారి ప్రతిభనివెతుక్కుంటూ అవకాశాలు వచ్చి వారి మెడల్లో వరమాలలు వేస్తున్నాయి. నాలుగు దశాబ్దాలపాటు ఆరోగ్యంతో ఆయుర్దాయాలతో సలక్షణంగా వున్న నేను ఈ మార్పుచూసి చాలా - ఆనందపడుతున్నాను. నేను ఈ నవలలో రామకృష్ణకి బిందుమాధవిచేత వ్రాయించిన వుత్తరంలో నా స్వప్నం ఈ రోజు యదార్థం అయింది. విదేశాలు వెళ్ళిన మేధావులు తమ అభివృద్ధితో సంతోషపడి ఊరుకోవడంలేదు. తమదేశాన్ని గురించి ఆలోచిస్తున్నారు. తమ మూలాలని అభివృద్ధి పరిచే ప్రయత్నాలు చేస్తున్నారు. దానికోసం వారి కష్టార్జితం నిస్వార్థంగా ఖర్చు చేస్తున్నారు. వెనుకబడిన గ్రామాలు దత్తత తీసుకుంటున్నారు. పేద ప్రజలకి కావలసిన తిండి, బట్ట, సౌఖ్యం మొదలైనవి తమవంతు సాయంగా అందించడానికి తపన పడుతున్నారు. ప్రపంచ పటంలో మనదేశాన్ని అత్యుత్తమ అబివృద్ధిచెందిన దేశంగానే కాదు విశిష్టమైన వ్యక్తిత్వంగల దేశంగా కూడా నిలబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

నాకు నా యీ వయసులో వీరిని చూస్తుంటే వేలమంది రామకృష్ణలు తిరిగి వస్తున్నట్టు కనిపిస్తున్నారు.

ఒక రచయిత్రిగా, ఒక తల్లిగా, ఒక సోదరిగా, ఒక దేశపౌరురాలిగా నాహృదయం సంతోషంతో పులకిస్తోంది. అందుకే అంటున్నాను , నా నవలల్లో " ఈ దేశం మాకేమిచ్చింది" నాకు నిజంగా కీర్తికిరీటమే!!


***

# పార్థు

నా నవలలు అన్నిటిలోకి 'పార్థు' ఒక విలక్షణమైంది అని పాఠకులు అంటుంటారు. చాలా తక్కువమంది మెచ్చుకునే నవలయిది. పునర్ముద్రణలో చాలా వెనుకబడిన నవలకూడా. పాఠకుల్లో ఒక ప్రత్యేక వర్గంవారు మాత్రమే దీన్ని బాగా అభిమానించటం నేను గమనించాను. 'పార్థు' నవలని ఒకసారి చదివితే చిన్నారి పార్థు మా గుండెల్లో చెరగని జ్ఞాపకం అయిపోతాడు అని అంటారు వారు.

నేను నా నవలలు ఇతివృత్తాల కోసం ఎప్పుడూ శ్రమపడలేదు. నా చుట్టూవున్న ప్రపంచంలో, రకరకాల మనస్తత్వాలు, విభిన్న జీవన రీతులు గల వ్యక్తులు నా హృదయానికి దగ్గరగా వచ్చేస్తారు. ఎప్పుడూ ఒక హీరోయిన్, ఆమె వ్యక్తిత్వం - ఆత్మాభిమానం సుస్పష్టంగా వ్యక్తీకరించే నేను, అలాటి ఛాయలేవీ లేని, అతి సాధారణ యువతి, పరిస్థితుల ప్రభావంలో చిక్కి దాని వాలుగా కొట్టుకుపోవటం వుంది ఇందులో. ఈ నవలలో 8 సంవత్సరాల బాలుడు 'పార్థు' కళ్ళతో తాను చూసే తల్లి ప్రవర్తన, ఆమె జీవితంలోకి వచ్చిన వ్యక్తుల పట్ల ఆ చిన్నారి హృదయానికి గల రాగద్వేషాలతో ఈ కథ నడుస్తుంది. చిన్నారి పార్థుకి నా మనసులో దిద్దుకున్న రూపకల్పనకి, బలీయంగా జరిగిన సంఘటన మూలం మీకు చెబుతాను.

చాలా సంవత్సరాల క్రితం - మా ఇంట్లో పై పనికి ఒక స్త్రీ వచ్చి పనిచేసి వెళ్ళేది. ఆమె చాలా మంచిదే నేను ఇస్తున్న జీతానికి ఆమె ఒప్పుకున్న పని చాలా నిజాయితీగా చేసేది. నేను ఆమె ముఖంలో ఎప్పుడూ నవ్వు అనేది చూడలేదు. ఎప్పుడైనా టీ ఇస్తూ సరదాగా నవ్వించటానికి ప్రయత్నం చేసేదాన్ని. నా ప్రయత్నం ఎప్పుడూ ఫలించలేదు.




మామూలుగా మనందరం మామూలు సంఘటనలకి స్పందిస్తూ మన ముఖాల్లో ప్రత్యక్షం అయే హావభావాలు ఆమె ముఖంలో ఎప్పుడూ చూడలేదు. ఎప్పుడూ 'కనుబొమలు ముడిచి' చూసేది. అలా అని కోపిష్టిగానీ, చిరాకు పడటం గానీ లేదు. నేను పరిశీలనగా చూసేదాన్ని. ఎందుకో ఆమెలో ఈ ప్రపంచంతో సంబంధం లేని నిరాసక్తత కన్పించేది. ఆమె తనవెంట ఒక్కోసారి సాయంకోసం పది సంవత్సరాల కొడుకుని వెంట

తెచ్చుకునేది. వాడు స్కూలుకి ఎప్పుడూ వెళ్ళలేదు. తల్లికి చేదోడు వాదోడుగా ఉండటం, తీరికవేళలో ఇంటికి వీధి చివరవున్న సైకిల్ షాపుకి వెళ్ళి, సైకిళ్ళకి గాలి కొట్టటం చేస్తాడట. "నువ్వెందుకు చదువుకోవు" అని అడిగాను వాడిని. 'నాకిష్టం లేదు' అన్నాడు విసురుగా. వాడిముఖం మీద, పెద్ద ముడిగా చర్మం కాలిన మచ్చ ఉంది. 'ఏమైంది' అక్కడ అని అడిగాను. వాడు సమాధానంగా వాళ్ళమ్మ వైపు కోపంగా చూసాడు. 'పో ఇక్కడ నుంచీ' అని తల్లి గట్టిగా కసిరింది.

"ఏమైంది సత్తెమ్మా మీ అబ్బాయికి" అన్నాను. "ఛండాలపు ఎదవ. సస్తే పోయేది. బతికి పీక్కుతింటున్నాడు" అంది.

ఆమె వెంటనే కారణం చెప్పలేదు. నేను వదలలేదు. అడగ్గా అడగ్గా కొడుకు పది రోజులకి చెప్పింది. సత్తెమ్మ మొగుడు ఆమెని కొడుకుని వదిలేసి పోయాడు. సత్తెమ్మ తెల్లవారుఝామున లేచి నాలుగైదు ఇళ్ళు చేసినా డబ్బు సరిపోవటం లేదు. ఇంట్లో కొడుకుని, తల్లిని పోషించాల్సిన బాధ్యత ఉంది. వయసులో ఉంది. చేతిలో డబ్బులేదు. ఆమె కరీంనగర్‌లో ఉండగా ఇళ్ళల్లో పని త్వరగా చేసి, కూలిపనికి వెళ్ళేదట. అక్కడ ఒక మేస్త్రీ పరిచయం అయ్యాడు. స్నేహం కలిసింది. రాత్రికూడా ఇంటికి రాసాగాడు. అతనికి పెళ్ళాం పిల్లలు ఊరిలో ఉన్నారు. సత్తెమ్మకి డబ్బు సాయం చేసేవాడు. కొడుక్కి ఇది నచ్చలేదు. ఒకసారి మేస్త్రీ సత్తెమ్మ దగ్గరకి వచ్చి ఆ రాత్రి ఉండి బాగా తాగి నిద్రపోతుంటే, పొయ్యిలో మండుతున్న కట్టెపుల్ల తెచ్చి అతని ముఖం మీద పెట్టాడు. పుల్లకి ఎక్కువ మంట లేకపోవటం వల్ల, నిద్రలోనే పక్కకి తిరగటంతో అతని ముఖం కాలలేదు కానీ జుట్టు కాలింది. తర్వాత ఆ మేస్త్రి బద్ధ శత్రువైపోయాడు. ఒకసారి సత్తెమ్మ ఇళ్ళలో పనిచేసి ఇంటికి వెళ్ళేసరికి ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. లోపల నుంచీ కొడుకు అరుస్తున్నాడు. తలుపులు తీసుకుని లోపలికి వెళ్ళేసరికి వాడి ముఖం కాలిపోయింది. మేస్త్రి కుర్రాడిని మంచానికి కట్టేసి ముఖం మీద కాల్చాడు. ఇరుగు పొరుగు వారు వచ్చి సత్తెమ్మనే బాగా తిట్టారు. మేస్త్రి పరారి అయ్యాడు. కొడుక్కి వైద్యం చేయించేసరికి సత్తెమ్మ తలప్రాణం తోకకి వచ్చింది. మేస్త్రి మనుషులు సత్తెమ్మని, కొడుకుని చంపేస్తామని బెదిరించారట. సత్తెమ్మ కరీంనగర్ వదిలి హైదరాబాద్ వచ్చింది. సత్తెమ్మ ఎంత కష్టపడ్డా ఆర్థికభారం తీరటం లేదు. వడ్డీ పెరుగుతున్న మూడు వేలు ఆమెను కృంగదీస్తున్నాయి.

ఆమె సంగతి వినగానే నా ముఖంలో నవ్వుకూడా ఎగిరిపోయింది. ఆమె బాధ నాకర్థం అయ్యింది. భర్త వదిలేసాడు. తల్లినీ, కొడుకునీ పోషించాలి. వయసులో ఉంది. మేస్త్రితో స్నేహం ఆమె శరీరానికి, ఇంటి అవసరాలని రెండూ తీర్చింది. కానీ కొడుక్కి అది నచ్చలేదు. అమ్మని వాడెత్తుకు పోతాడేమోనని భయం, సత్తెమ్మ తల్లి మనవడికి ఇదే నూరిపోసేదట.

కొద్దిరోజుల తర్వాత సత్తెమ్మ మా ఇంటికి రావటం మానేసింది. మా అందరి ఇళ్ళలో పని ఒకేసారి మానేసింది. పక్కింటి ఆవిడకి కబురు చేసి అడిగితే మేస్త్రి కూడా హైదరాబాదు వచ్చేసాడు, కొడుకుని చంపుతాడేమోనని భయంతో ఈ ఊరినుంచీ వెళ్ళిపోయింది అనిచెప్పింది.

ఇందులో నాకు సత్తెమ్మ తప్పు కనిపించలేదు. ఆ పరిస్థితుల్లో మేస్త్రితో స్నేహం సహజం అనిపించింది. మన బాంధవ్యాలు - అవసరాలు అన్నీ డబ్బు చుట్టూనే తిరుగుతుంటాయి. కొడుకు యొక్క అభద్రతాభావం కూడా నాకర్థం అయింది. తల్లినీ, తననీ తండ్రి వదిలేసినట్లే తల్లికూడా వదిలేస్తుందేమోనని ఆదుర్దా, భయం వచ్చి ఉంటాయి.

చిన్నవాడు, వాడి మనసు ఎంత తల్లడిల్లి ఉంటుందో అనిపించింది. కూతురు మీద దెబ్బ తీయటానికి ఆ ముసలమ్మ మనవడిని ఉపయోగించుకుంది.

సత్తెమ్మ కొడుకే 'పార్థు'. మనకి ఉన్నది ఒకే జీవితం! అదికూడా ఎంతో స్వల్పకాలం. కనుమూసి తెరిచేలోపల అయిపోతుంది. మనుష్యులకి ఎందుకు ఇన్ని బాధలు అనిపిస్తుంది. మరీ కొంతమంది జీవితాలు గమనిస్తే, వారెందుకు పుట్టారో కూడా క్షణం ఆలోచించేటంత వెసులు బాటుకానీ, రవ్వంత ఆనందంగానీ లేకుండా, బాధల సుడిగుండంలో పడి, అలాగే జీవితం అంతా కొట్టు మిట్టాడుతారు. పార్థు నవల నాక్కూడా చాలా ఇష్టం. అది ఎక్కువగా అమ్ముడు కాకపోయినా, దానివల్ల నాకు పేరు ప్రతిష్టలు ఇనుమడించకపోయినా, అది నాకు అభిమానంగా అనిపిస్తుంది.

నేను రెండురోజుల క్రితమే నా YSSR Foundation తరపున స్ట్రీట్ చిల్డ్రన్ హోమ్‌కి వెళ్ళి వాళ్ళకి దుప్పట్లు, పళ్ళు ఇచ్చి శ్రీరామనవమి నాడు అందరికీ భోజనం చేయించి పెట్టమని 1600/-రూపాయలు ఇచ్చి వచ్చాను (ఒకరోజు నలభై మంది పిల్లలకి భోజనం ఖర్చు). పిల్లలందరితో మాటీమ్, విష్ణుప్రియ, హేమలత, సుజాత, కెనడా నుంచీ వచ్చిన లక్ష్మీనారాయణగారు, ఆయన కన్నడ ఫ్రెండ్ రమేష్ అందరం మాట్లాడాం. ఆ పిల్లలంతా చాలా వరకు తల్లితండ్రులకు దూరం అయిన వాళ్ళే మూడు సంవత్సరాల చిన్న రమేష్ నుంచీ 14 సంవత్సరాల వయసు వరకూ ఉన్నారు. వాళ్ళందరిలో నాకు 'పార్థు'యే కనిపించాడు. కారణాలు ఏమయితేనేం! ఇంటినీ, తల్లితండ్రులకీ దూరం అయ్యారు. వాళ్ళ మనసుల్లోకి మనం తొంగి చూస్తే ఒక్కొక్కరిదీ ఒక వ్యధాభరితమైన కథ. నేను 'పార్థు' నవల వ్రాసినప్పుడు, ఇలాంటి హోమ్స్ ఉన్నాయి అనికూడా తెలియదు. కొంతమంది సంఘంపట్ల బాధ్యతగా, ఇలాంటి ఆశ్రయాలు నడుపుతుంటే, మనవంతు బాధ్యతగా మనం ఏ కొద్దిపాటి సాయం చేసినా అదివారికి పెద్ద సాయమే అవుతుంది. ఎందుకంటే, కొన్ని వానబిందువులు కలిస్తే ఒక చెంచాడు నీళ్ళు అవుతాయి. కొన్ని చెంచాలు నిండితే ఒక మగ్ నీళ్ళు, కొన్ని పదుల మగ్‌లు పోస్తే ఒక బకెట్ నిండుతుంది. కొన్ని వందల బకెట్లు పోస్తే ఒక టాంక్ నిండుగా నీరు అవుతుంది. కొన్ని వందల టాంకుల నీళ్ళు అయితే ఒక చెరువు అవుతుంది. చెరువు నిండా నీళ్ళు పడితే, ఆ ధార అవిరామంగా ఉంటే, అది పొలాన్ని సస్యశ్యామలం చేస్తుంది. అలాగే మనం అందరం మనకి తోచినంత ఆర్థిక సాయం చేస్తే నీరు పంట పొలాన్ని సస్యశ్యామలం చేసినట్లే, ఈ డబ్బు 'రివర్ ఆఫ్ నరిష్‌మెంట్ టు నీడీ పీపుల్' అవుతుంది. మంచి పనికి ఆలస్యం అంటూ లేదు. ఎప్పుడైనా మీరూ మొదలు పెట్టవచ్చుకదా!

****

# కీర్తి కిరీటాలు

నా యీ నవలకి, 'కీర్తికిరీటాలు' అన్న పేరు పెట్టాలని నాకెందుకు అనిపించిందో ఇప్పటికీ నాకు తెలియదు. ఒక్కోసారి టైటిల్స్ ఫ్లాష్‌లా వచ్చేస్తాయి. అంతే. కీర్తికిరీటాలు అనే మాట కొత్త ప్రయోగం అని కొంతమంది అన్నారు. ఇది విమర్శకులకి కూడా వచ్చిన నవల.

ఒకసారి రవీంద్రభారతిలో పద్దెనిమిది సంవత్సరాల వయసుగల అమ్మాయి చేస్తున్న డాన్స్ ప్రోగ్రామ్ చూసాను. ఆమె తొలి యవ్వనపు కాంతులతో చాలా అందంగా ఉంది. అద్భుతమైన భావ విన్యాసాలు చూపించింది. ఇంత చిన్న వయసులో అంత ప్రతిభ చూపిస్తున్న ఈ అమ్మాయి భవిష్యత్తులో ఒక గొప్ప కళాకారిణి తప్పక అవుతుంది, ఆమెకి ఉజ్వల భవిష్యత్తు ఉంది అని నమ్మాను నేను. కాని నాలుగేళ్ళ తర్వాత ఆ అమ్మాయి తెలిసిన ఒక బంధువు చాలా విషాదమైన వార్త చెప్పాడు. ఆ అమ్మాయి డాన్స్ నేర్పించే అతని ప్రేమలోపడి, పెళ్ళి చేసుకుందిట. ఇద్దరు పిల్లలు. ఇల్లు - సంసారం గొడవలో పడింది. భర్త ఆమె డాన్స్ చేయడానికి వీల్లేదని షరతు పెడితే, ఆ లక్ష్మణరేఖ దాటలేదట. ఆయన వెళ్ళిపోయిన తర్వాత కూడా నేను ఆ అమ్మాయి గురించే ఆలోచించాను. ఆమెలో ఉన్న అసాధారణమైన ప్రతిభ మొగ్గలోనే తుంచివేయబడింది. ఆ అమ్మాయేకాదు, నా చుట్టూవున్న చాలామందిలో ముఖ్యంగా స్త్రీలు ఏవో ప్రతిభలు ఉన్నా, అవి సంసారబంధం ఇరుసుల క్రిదపడి నలిగి, రెక్కలు తెగిన పువ్వులు అవటం నేను గమనిస్తూనే ఉన్నాను.

నాకు ఎప్పుడూ డాన్స్ హఠాత్తుగా మానేసిన ఆ అమ్మాయే గుర్తుకు వస్తూ ఉండేది. ఒక విధంగా నన్ను ఆమె వెంటాడింది. ఆమె జీవితంలో ఎక్కడో తప్పు జరిగిపోయింది అనిపించేది.

ఇది జరిగిన చాలా రోజుల తర్వాత నేను నా రచనా వృత్తిలో పడి మెల్లగా ఆ డాన్సర్‌ని మర్చిపోవటం మొదలు పెట్టాను.

ఒకరోజు మధ్యాహ్నం - మా పెద్దన్నయ్యకి తెలిసిన సీత అనే ఒకావిడ వచ్చింది. వచ్చిన తర్వాత మాటల సందర్భంగా ఆవిడ జీవితం గురించి చెప్పింది. ఆమె ప్రతిభ గల డాన్సర్. పేరు - డబ్బు - చిన్నతనంలోనే స్వంతం అయినాయి. ఆమె ఒకతని ప్రేమలో పడింది. అతను మోసగాడు అని తెలిసింది. భరించలేకపోయింది. ఆత్మహత్య చేసుకోవటానికి వెళ్ళి రైలు క్రింద తలపెట్టబోయింది. ఎవరో లాగి రక్షించారు. కానీ ఆమె కాలు మీదనుంచీ రైలు చక్రం వెళ్ళింది. కుంటిదయింది. ఇది ఇంకా నరకం. ఆమె గురువుగారు ఆమెని సేదదీర్చారు. జైపూర్ కాలు అమర్చారు, నడవగలుతోంది. అనారోగ్యంతో మంచంలో ఉండటం వల్ల లావు అయిపోయింది. బాధలతో నలిగిపోవటంతో ముఖంలో కళ మాసింది. ఆర్థికమైన ఇబ్బందులు. ఎవ్వరూ సాయం చేయలేదు. ఒకళ్ళిద్దరు పిల్లలకి డాన్స్ నేర్పిస్తూ జీవితం కష్టం మీద లాగుతోంది. అప్పటికి ఆమెకి 32 సంవత్సరాలు ఉంటాయేమో.

ఈమె వెళ్ళిపోయిన తర్వాత, ఈమె జీవితం కూడా నన్ను కదిలించింది. కీర్తికిరీటాల్లో హీరోయిన్ సువర్ణలత ప్రాణం పోసుకుంది. ఈ నవల కూడా స్వాతి మంత్లీలో వచ్చింది. అందిరికీ ఇప్పటికీ కూడా నచ్చే నవలల్లో ఇది ఒకటి.

"కీర్తికిరీటాలు" అని పేరు పెట్టడంలో గ్లామర్ కంటే, నా ఉద్దేశ్యంలో దాని వెనుక బాధే ఉంది. ఏదో ఒక ప్రతిభతో కళాకారుడు పాపులర్ అవుతాడు. గ్లామర్ వస్తుంది. అభిమానులు పెరుగుతారు. మొదట్లో ఈ అభిమానం చాలా సంతోషంగా ఉంటుంది. తర్వాత - తర్వాత అభిమానుల డిమాండ్ చాలా పెరిగిపోతుంది. ఇంకా - ఇంకా కొత్త ఆనందాలు వారి మనసుల్ని జలపాతంలో తడిపేసేవి కావాలంటారు. ఇక్కడ నుంచీ కళాకారుడికి కష్టం, ఆవేదన మొదలు అవుతాయి. తనని అభిమానించి దగ్గరికి వచ్చినవారు, తననెత్తిన ఎక్కి డిమాండ్స్ పెంచడంతో వారికోర్కెలకి సరితూగలేక కళాకారుడు డిప్రెషన్‌కి గురి అవుతాడు. కళాకారులకి, అభిమానులకి మధ్య ఇంత అంతర్యుద్ధం ఉంది. అందుకే కళాకారుడెప్పుడూ పదిమంది పొగిడితే, 'నేను చాలా గొప్పవాడిని' అని విర్రవీగకూడదు. అహం పెంచుకోకూడదు. అది అతని పతనానికి, అశాంతికి నాంది అవుతుంది. నేను ఎప్పుడూ ఈ కీర్తిప్రతిష్టల పట్ల డిటాచ్‌మెంట్‌తోనే ఉన్నాను.



నేను ఆరాధించే చాలా కొద్దిమంది వ్యక్తుల్లో లతా మంగేష్కర్ ఒకరు. ఆమె పెళ్ళి చేసుకోకపోవటం నాకెందుకో చాలా సంతోషంగా అనిపించేది. లలిత కళల్లో గానం, నాట్యం, రచన వీటిల్లో అసాధారణమైన ప్రతిభ ఉన్నవాళ్ళు. ఈ సంసారబంధాల చిక్కుముడుల్లో ఇరుక్కోకూడదు అని నా అభిప్రాయం. ఎందుకంటే సంసారం అంటే పెద్ద బాధ్యత. ఒకసారి ఆ పరిధిలోకి అడుగుపెడితే, ఆ వ్యక్తి దాని ఒక్కదానికే ప్రాధాన్యత ఇవ్వాలి. తనని తాను ద్వితీయ శ్రేణి వ్యక్తిత్వంగా భావించుకోవాలి. జీవితంలో మనిషిని సంసారబంధం అంతసారం లాక్కుంటుంది. ఆర్టిస్టులకి ఇలాటి బంధాలు కుదరవు. వారికి భగవంతుడు జన్మతః ఇచ్చిన నైపుణ్యం అది.

అంతేకాదు ప్రతిభగల ఏ కళాకారుడు అయినా, తిండికీ, నీడకీ, సంపాదన కోసం తన శ్రమ మీద తాను ఆధారపడకూడదు. డబ్బు సంపాదన బాధ్యతలో పడిన కళాకారుడు, తనలోని సృజనాత్మకతకి న్యాయం చేయలేదు. కళాకారుడికి తనలోని కళని ప్రదర్శించటం అనేది ఒక తపస్సు. అతనికి డబ్బు సంపాదన అవసరంలేదు. బిరుదులు అఖ్ఖర్లేదు. పొగడ్తలు అసలే అవసరం లేదు. అతనిలోని

కళని వ్యక్తీకరించుకోవటమే అతని ధ్యాస. అందులోనే అతనికి ఆత్మానందం. అతని కళసాటి ప్రజలకి ఆనందం కలిగిస్తే అమ్మ ముందు వెన్నముద్దలు తినే చిన్నపిల్లవాడిలా స్వంతోషపడిపోతాడు.

పూర్వకాలంలో రాజులు శిల్పులకి, చిత్రకారులకి సంవత్సరాల తరబడి తమ నైపుణ్యం ప్రదర్శించి చరిత్రలో అద్భుతమైన 'సంస్కృతీ వారసత్వం' ఇవ్వగలిగేట్టు కృషిచేసే వారి మంచి చెడులు చూసే బాధ్యత రాజే తండ్రిలా చూసుకునేవాడు. అందుకే దేవాలయాల మీద శిల్పాలు చెక్కటానికి సంవత్సరాలు పట్టేవి. ఆ కళ తండ్రి నుంచీ కొడుకుకి వచ్చి తరం మారినా, ఆ శిల్ప సంపదని వృద్ధి చేసే రెండో తరం వచ్చేది.

ఈనాడు కళాకారులంటే ఎవ్వరికీ పట్టదు. అతని ప్రతిభ ప్రదర్శిస్తే అది ఆనందించి చేతులు దులుపుకుని వెళ్ళిపోయే వాళ్ళే తప్ప అతని ఆలనా, పాలనా చూసే వాళ్ళే లేరు. ఎంతో మంది కళాకారులు, వృద్ధాప్యంలో సరైన తిండి దొరక్క ఆకలితో అలమటించే పరిస్థితులు ఉన్నాయి. కళాకారులు వ్యాపారవేత్తలు అవలేరు. డబ్బు సంపాదన నెపంతో, సంఘాన్ని దోచుకునే సామర్థ్యం వాళ్ళకి ఉండదు. సున్నితమనస్కులు. కాస్త అగౌరవానికే కళ్ళలో చివ్వున నీళ్ళు తిరుగుతాయి. ఎంత ఆకలిగా ఉన్నా ఎవరి ముందూ చేయిజాచలేరు. కళాకారుని మంచి చెడ్డలు చూడాల్సిన బాధ్యత ఈ సంఘంలో ప్రతి ఒక్కరిదీ. ఎందుకంటే పాములు నిచ్చెన లాటి డబ్బు సంపాదనతో సంసార బాధ్యతల ఇనుప ముళ్ళ మధ్య బ్రతికే మీకు మనసుకి శాంతి, ఆనందం ఇచ్చేది కళ ఒక్కటే.

'కీర్తికిరీటాలు' పేరు అందరికీ నచ్చటమే కాదు, అది నాకు ఒక పెద్ద 'కీర్తికిరీటం' అయింది.

క్రిందటి సంవత్సరం శ్రావణమాసంలో ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అమ్మాయి శ్రావణమంగళవారం నోము నోచుకుని శనగలు వాయినం ఇవ్వటానికి వచ్చింది. నేను ఆమె ఉద్యోగం విని 'నువ్వు ఈ నోములు నోస్తున్నావా?' అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం? నోయకూడదాండీ, చదువుకుంటే మన కల్చర్ వదిలేసుకోవాలా? " అంది నన్ను నిలదీస్తున్నట్టుగా, నేను జవాబు చెప్పలేకపోయాను. ఈమె జీన్స్ - షర్ట్‌తో ఆఫీసుకి వెళుతూ చాలాసార్లు ఎదురైంది. పట్టుచీరతో, కుంకుమ బొట్టు పెద్దగా పెట్టుకుని, చేతులనిండా గోరింటాకు, గాజులతో వచ్చింది.

'నీ పేరేమిటమ్మా?" అన్నాను.

ఈ మాట వినగానే ఆ అమ్మాయి ముఖం మాడ్చుకుంది, 'సువర్ణలత' అంది.

'మంచి పేరు' అన్నాను.

'మీ నవలల్లో పేరట కదా! మా అమ్మకి మీరంటే నాలా ఇష్టం. నాకు తెలుగు రాదు. మా అమ్మ మీ నవలలు చెబుతూ ఉంటుంది. ఆవిడ ఇష్టపడితే పడింది. నాకు ఈ పేరు, మా అన్నయ్యకి రాజశేఖరం అని పెట్టింది. బోరు పేర్లు. మాకు మా పేర్లు అస్సలు నచ్చలేదు. హాయిగా రేష్మి అనీ, నవ్య అనో, పంకజ్, మనోజ్ అనో మీరెందుకు మా కథల్లో పేర్లు పెట్టలేదండీ,' అంది. నేను హతాశురాలినయాను. ఆ అమ్మాయి వెళ్ళి పోయిం తర్వాత, ఆ అమ్మాయి మాడ్చుకున్న ముఖమే గుర్తుకు వచ్చింది. నవ్వు వచ్చింది. పాపం! వాళ్ళ అమ్మ ఇష్టానికి తను, అన్నయ్య బలి అయినట్టు మాట్లాడింది.

ఇలా నవలల్లో పేర్లు తమ పిల్లలకి పెట్టుకున్న అభిమాన పాఠకులు నా జీవితంలో చాలా మంది ఎదురయారు. అందుకే అంటాను. మన అభిమానం ఎదుటవారిని బాధించకూడదు అని.

***

# గిరిజా కళ్యాణం

నేను, నా ఈ 'గిరిజా కళ్యాణం' నవల 1979లో వ్రాసాను. అప్పట్లో శేషాచలం అండ్ కంపెనీ వారికి ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో 'డైరెక్ట్ నవల'గా నా నవల రిలీజ్ అవుతూ ఉండేది. మొదట్లో సీరియల్స్‌గా చదవడానికి అలవాటు పడిన పాఠకులు ఎక్కువ మంది చదవరేమోనని నేను సందేహించాను. పబ్లిషర్స్‌కి చాలా ధైర్యం ఉంది. ఆ సిరీస్‌లో వచ్చిన 'అభిశాపం' అమ్మకాలు అనూహ్యంగా వచ్చినాయి. రీడర్స్ పుస్తకాల పుస్తకాల షాపులకి వెళ్ళి, ముందే డబ్బులు చెల్లించి అడ్వాన్స్ కాపీ రిజర్వ్ చేసుకోవడం జరిగింది. ఇది నాకూ శేషాచలం అండ్ కంపెనీ వారికి కూడా కొత్త ఉత్సాహం ఇచ్చింది. ఆ సీరీస్‌లో వచ్చిన రెండవ నవల 'గిరిజా కళ్యాణం'.

నేను నా చిన్నప్పటి నుంచీ నా చుట్టూవున్న స్త్రీలని గమనిస్తున్నాను. వివాహం అనేది వారికి ఒక పవిత్రమైన బాధ్యత. ఈ బాధ్యత నిర్వహించడంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, నూటికి 99.5 మంది వివాహబంధం మాత్రం వదులుకోరు దాన్ని అసహ్యించుకోరు. పెళ్ళిచేసుకున్న వ్యక్తులు దుష్టులు, నీచులు కావచ్చు. కానీ వివాహబంధం మాత్రం స్త్రీకి అత్యంత అవసరమైన అనుబంధం అనే నమ్మకం వారి మనసుల్లో హిమాలయాలంత ఉన్నతంగా, పురాతన శిలలు ఉన్నంత ధ్రుఢంగా ఉండడం నేను అర్థం చేసుకున్నాను. వివాహబంధం పట్ల, చదువురానివారు, వచ్చినవారు, డబ్బున్న స్త్రీలు, లేమిలో ఉన్న స్త్రీలు అందరివీ ఒకటే అభిప్రాయాలు-

నాకిప్పటికీ చాలా గట్టి నమ్మకం, మన దేశ, సామాజిక సంస్కృతి మూలధాతువు స్త్రీయే! ఆమెకి కుటుంబంపట్ల గల దృఢమైన ప్రేమే ఈ సంస్కృతిని చెక్కు చెదరకుండా సంరక్షిస్తోంది. 'పెళ్ళి' అనే మూలంలో కేంద్రబిందువుగా నిలబడిన ఆమె, తన ఇంటిని, సమాజాన్ని, తన సంస్కృతిని, తద్వారా దేశాన్ని తనకి తెలియకుండానే తన సుకుమార భుజద్వయం మీద మోస్తోంది. ఇంట్లో అందరికీ వేళకి అన్నీ సమకూరుస్తూ కొండంత అండగా నిలబడబట్టే మగవారు బైట ప్రపంచంలోకి వెళ్ళి తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించి, ఈ సంఘం అభివృద్ధికి పాటు పడగలుగుతున్నారు. పిల్లలు చక్కగా ప్రశాంతంగా, ఏకాగ్రతగా చదువుకుని, నూతన సమాజశిల్పులుగా మారుతున్నారు.

ఇంత అభివృద్ధిని శక్తిగా కాంతికిరణాల్లా వెదజల్లే ఈ స్త్రీలలో నూటికి 99 మందికి అందంలేదు. గ్లామర్ అంటే ఏమిటో తెలియదు. ఆశించరు కూడా. తనకు ఉన్న హక్కుని వినియోగించుకోవాలని కూడా ఎప్పుడూ అనుకోరు. అసలు హక్కులు గురించి తెలుసుకోవాలనే ప్రయత్నమే ఉండదు. కొంత మంది చిలక పలుకులుగా 'స్వతంత్రం' గురించి సంభాషణలు చేసేవారు, ఈమెని మూర్ఖురాలుగా భావించి తక్కువ చూపు చూడడం నాకు తెలుసు. భర్తకి, పిల్లలకి, ఇంటికి వచ్చిన అనుకోని అతిథులని ప్రేమగా, ఆదరంగా అన్నం పెట్టాలనుకునే తల్లుల్ని మూర్ఖురాలు అనేవారిని ఏమనాలో నాకు మాట దొర్కడం లేదు. నిరంతర శ్రమ, కఠోర, నిస్వార్థం, కుటుంబం పట్ల ఆమెకిగల అపారమైన ప్రేమ ఈ గుణాలుగల స్త్రీల సముదాయం నిండుగాఉన్న సమాజంలో ఉన్న మనమెంత అదృష్టవంతులం..! మనకి అమ్మ ప్రేమేకాదు, అక్క చెల్లెళ్ళ ప్రేమ, మేనత్త, పిన్నిల ప్రేమ, అమ్మమ్మ, నానమ్మల ప్రేమ, ఇరుగమ్మ పొరుగమ్మల ప్రేమ, చివరికి ఇంటి పనిమనిషిగా వచ్చిన స్త్రీ కూడా 'బుజ్జీ', 'కన్నా' అంటూ మనల్ని ఆదరంగా పిలిచే ప్రేమ. ఇంత లభించే మనం గొప్ప అదృష్టవంతులం కాదంటారా! వివాహ బంధాన్ని ఇంత నమ్మే, ఈమెకి మనం ఏమిస్తే ఋణం తీరుతుంది. నాకెప్పుడు, సాదా సీదా సాధారణ గృహిణిగా కన్పించే స్త్రీయే, నా నవలల కథానాయికలకి పరోక్షంగా మూలధాతువు. నేనేప్పుడూ, ఈమెలో అపారమైన శక్తినీ చూస్తున్నాను.

నాకు తెలిసిన వాళ్ళలో ఒక అమ్మాయికి బాగా ధనవంతుడు అయిన కుర్రాడితో వివాహం అయింది. ఆ అమ్మాయికి బాగా డబ్బుంది. చదువు పెద్దగా లేదు. తల్లితండ్రులకి ఏకైక కుమార్తె. పెద్దలు కుదిర్చిన సంబంధమే, పెళ్ళి వైభవంగా అయింది. తర్వాత వాళ్ళ కాపురం సరిగ్గా లేదని తెలిసింది. అతను గుఱ్ఱపు పందాలంటే పిచ్చి.. స్నేహితుడి చెల్లెలు అంటే చాలా ఇష్టం. తల్లితండ్రులు ఒప్పుకోలేదు. తల్లి ఏడిస్తే, చచ్చిపోతామనని బెదిరిస్తే ఈ అమ్మాయిని చేసుకున్నాడు. కానీ ఆమెని తిరస్కారంగా, అవమానిస్తూ చూసేవాడు. తల్లితండ్రులు రోషపడ్డారు, డైవోర్సు ఇప్పించేయాలని చూశారు. కానీ ఆ అమ్మాయి ఒప్పుకోలేదు. "నేను ఓపిక పడతాను. నాకు విరక్తి కలిగిన రోజున నా మార్గం నేను చూసుకుంటాను. మీరు నాకు లోటు లేకుండా పెళ్ళి చేశారు. మీ బాధ్యత అయిపోయింది. నా జీవితం ఏమిటో నేనే నిర్ణయించుకోవాలి" అని ఖచ్చితంగా చెప్పేసింది. ఆ అమ్మాయి చాలా మామూలు అమ్మాయి. తర్వాత మళ్ళీ చూసాను. పండంటి కొడుకుతో, భర్తతో కనిపించింది. అతను ఆమెను ప్రేమగా చూడడం నాకే ఆశ్చర్యం వేసింది. ఏం జరిగిందో తెలియదు. ఆమె సహనం ఫలించింది. భర్త దగ్గరయ్యాడు. సంసారం ఆనందంగా ఉంది. ఇది ఆ అమ్మాయి ఘనవిజయం అనిపించింది. కొన్ని విజయాలు పొందడానికి కఠోరనిశ్చబ్దం, ఓర్మి చాలా అవసరం అన్న సంగతి తెలుసుకున్నాను. ఆ అమ్మాయే గిరిజాకళ్యాణంలో గిరిజ.


ఈ సంఘటననే నేను నాదయిన శైలిలో నవలగా వ్రాసాను.

ఈ నవల ఏప్రిల్‌లో శేషాచలం అండ్ కంపెనీవారు ప్రథమంగా డైరక్ట్ నవలగా రిలీజ్ చేశారు. తర్వాత చెప్పలేనన్ని పునర్ముద్రణలు వచ్చాయి. ఇది 2007. ఈ నవల 'గిరిజాకళ్యాణం' సినిమాగా (హీరో శోభన్‌బాబు, హీరోయిన్ జయప్రద) వచ్చి నూరు రోజులు ఆడింది. (ఇది 25 సంవత్సరాల క్రిందటి సంగతి). ఇప్పుడు టీ.వీ. సీరియల్‌గా వస్తోంది. అప్పటికీ ఇప్పటికీ తరాలు మారినాయి. అయినా ఈ కథని ఆదరిస్తున్న వారు చాలామంది ఉన్నారంటే, మానవీయ మూలాన్ని తట్టే కోణాలు ఇందులో ఎక్కడో ఉండే ఉంటాయి అనేకదా! లేక, నేను ఆరాధించే మధ్యతరగతి మామూలు స్త్రీకి ప్రతిరూపం. కాబట్టి నాలాగే చాలామంది ఇష్టపడుతున్నారో!

***

# మోహిత

**ఈ నవల విడుదల అయినతర్వాత – ‘మోహిత‘ పేరు (హీరోయిన్ పేరు) బాగుందని చాలామంది అన్నారు.** ఈ పేరు నాకు ఎప్పుడు దొరికిందో నేను మర్చిపోయాను. నవలకి ఇతివృత్తం ఒక పట్టు అయితే, ఆ నవలకి పేరు పెట్టటం అది సూటిగా, ఆకర్షణీయంగా, ఉండి చదువరులకి కుతూహలం రేకెత్తించే విధంగా ఉండటం మరొక ఎత్తు. రచయత నవల పేరుతోనే పాఠకుల మనసు మీద సగం పట్టు సాధించాలి అని నేను నమ్ముతాను. నవల పేరుకి – నవల ఇతివృత్తానికి దూరం ఉంటే ఆ నవల ఫెయిల్యూర్ అవుతుంది. పేరుతో వచ్చిన కుతూహలంతో, పాఠకులు పుస్తకం కొనుక్కుని, కథలోకి తొంగి చూసినప్పుడు ఆ వ్యక్తి మనసు, చుట్టుప్రక్కల ప్రపంచంలో ఏం జరుగుతుందో పట్టనంత మైమరుపు తెప్పించి ఆ లోకంలోకి పరుగెత్తించాలి. నవల పూర్తయిన తరువాత కష్టంగా ఈ లోకంలోకి రావాలి. నవలలో పాత్రలు సన్నివేశాలు పాఠకుని మనసుని మంచి గంధపు పరిమళంలా ఆవరించాలి.




చాలా వరకు నేను నవలల పేర్లని సునాయాసంగానే పెట్టాను. పేరుతో ఇతివృత్తానికి సంబంధీకరణని మాత్రం పట్టువదలకుండా బాగా జాగ్రత్త పడేదాన్ని. నేను నా నవలని సృష్టించే రచయిత్రినే కాదు, నా నవలకి నేనే మొదటి పాఠకురాలిని, మొట్టమొదటి విమర్శకురాలిని కూడా. పాఠకురాలు, విమర్శకురాలు ఈ ఇద్దరు వ్యక్తులూ నాకు తోడుగా వుండటంతో, నాలో రచయిత్రి ఎప్పుడూ పాఠకురాలి అభిమానం పొందడానికి, విమర్శకురాలి సునిశిత విమర్శ

తట్టుకోవటానికి సదా అప్రమత్తంగా ఉండేది. అందుకే నవలని నేను ఒకేసారి వ్రాసినా, మళ్ళీ దాన్ని చూడకుండా పబ్లిషర్‌కి ఇచ్చేసినా, వారు అది చూడకుండా ప్రింటింగుకి ఇచ్చేసి, పుస్తకంగా నేరుగా పాఠకుల చేతుల్లోకి వెళ్ళిపోయినా, నాకెలాంటి విమర్శ ఎదురయ్యేది కాదు.

మోహిత నవలలో కారెక్టర్ కాంప్లెక్స్ ప్రధాన సూత్రం. హీరో చిన్నప్పుడు దూరమైన ప్రియతమ వ్యక్తికోసం మనసంతా కన్నులు చేసుకున్నట్టు జీవితంలో వెతుకుతుంటాడు. ఈ అమ్మాయి పేరు అన్నూ. అన్నూ అతని ప్రాణం. పెళ్ళి చేసుకోకూడదనే అనుకుంటాడు. అనుకోని పరిస్థితుల్లో మోహిత అతని జీవితంలోకి వస్తుంది. అతని కాంప్లెక్స్ ఆమె తెలుసుకుంటుంది. అన్నూ అతని బాల్యంలో జరిగిన ఒక అనుభవపు నీడ మాత్రమే అనుకుంటుంది. అతన్ని ఇష్టపడుతుంది. ప్రేమిస్తుంది. పెళ్ళిచేసుకుంటుంది. తరుణ్‌కి మోహిత అంటే ఇష్టమే. అన్నూ గురించి కావాల్సినంతగా మోహితతో మాట్లాడగలడు.

ఈ నవలలో మోహిత - తరుణ్‌లతో పాటు అన్నూ కూడా ఆద్యంతం కథలో ఉంటుంది కానీ ఆమె ఎప్పుడూ కన్పించదు. రాను, రాను, రాను మోహిత తను అన్నూ విషయంలో తక్కువ అంచనా వేసానని, తరుణ్ మనసులో ఆమె స్థానం చెక్కు చెదరనిది అని అర్థం చేసుకుంటుంది. తన ఓటమిని బలవంతంగా అంగీకరిస్తుంది. అతనికి దూరంగా వెళ్ళిపోతుంది. తరుణ్‌ని ఎంతగా ప్రేమిస్తుందంటే అతను లేని జీవితం దుర్భరం అనిపిస్తుంది. ఇది తరుణ్ తనని వంచించటం కాదు. తన ప్రేమే తనని మోసం చేసిందని భావిస్తుంది. జీవితంలో వెనక్కి తిరిగి వెళ్ళలేనంత దూరం వచ్చేసినట్టు అనిపిస్తుంది. ఈ బలమైన ఫీలింగ్‌ని నేను చాలా మంది ఆడపిల్లల్లో చూసాను. ఒకసారి ఆడపిల్ల, పెళ్ళికి గానీ, ప్రేమకి గానీ కమిట్ అయితే, ఏకాగ్రతతో చాలా దూరం నడిచేస్తుంది. ఎక్కడో మధ్యలో తను కోరుకున్నవారికి తన అవసరం లేదని - వారు తనని వదిలేస్తున్నారని అర్థం చేసుకుని తల్లడిల్లిపోతుంది. వెనక్కి వెళ్ళే మార్గం ఉండదు. అంటే దాని అర్థం అన్ని సంవత్సరాలు తను పడిన శ్రమ, చూపిన ఏకాగ్రత కాలం ఒడిలోకి ఒలికిపోయినాయి. అవి తిరిగి తన ఒడిలోకి తీసుకోలేదు. పెళ్ళి అయిన స్త్రీలు పెళ్ళి పేరిట వంచించ పడ్డవారు, ప్రేమలో ఓడిపోయినవారు అందరూ ఇదే మాట. 'నేను వెనక్కి వెళ్ళలేను.' 'ఈ ప్రేమ - పెళ్ళి - ఈ బంధాలు నాకసలు అవసరం లేదు నామనసంతా విషాదం నిజమే.. ఎలాటి భావనాలేని స్వేచ్ఛాస్వాతంత్రపు సంతోషం నాకు కావాలి'. ఇదే చాలా మంది మనసుల్లో మూగ భావన. వీరిలోని ఈ భావనలే మోహిత నవలలోని ఇతివృత్తం.

నవల్లో చాలా బాధలు - ఎడబాట్లు వున్నా - పాఠకులకి నా మీద గాఢ నమ్మకం. జీవితంలో కష్టాలకి ఒక ముగింపు వుంటుంది. చీకటి తెరలు తొలగి సంతోషపు వెలుతురు ప్రకాశిస్తుంది. కష్టాలు ఒక గతం మాత్రమే. ఓర్చుకోవాలి! ఓర్చుకుంటే ఆనందం మన సొంతం అవుతుంది. ఈ మెసేజ్ నా నవలల్లో వారికి తప్పకుండా దొరుకుతుందని వారి నమ్మకం. నేను కూడా వారి నమ్మకాన్ని వమ్ము చేయను.


ఓర్మి వుంటే జీవితంలో తప్పకుండా, మన కష్టం యొక్క మూల్యం మనకి దక్కుతుందని నాకు కూడా గాఢ నమ్మకం.

తరుణ్ అన్నూ కోసం తీవ్రంగా వెతుకుతాడు. వెనకటిలా తన కోసం కాదు. ఇప్పుడు తన స్వేచ్ఛకోసం! అన్నూ కనిపిస్తే ఆమెకి ఏంకావాలో అది తను ఇస్తే - తన మనసు స్వేచ్ఛ పొందుతుంది. బంధనాలు లేని పరిపూర్ణమైన మనసుతో, తను వెళ్ళి మోహిత ముందు ప్రేమికుడిగా మోకరిల్లితే - మోహిత తప్పకుండా తనని స్వీకరిస్తుంది. మోహిత లేకుండా తను బ్రతకలేడని అతనికి అర్థం అయింది. మోహిత తన ఊపిరి.

నవల చివరలో చిన్న ఛమక్! తరుణ్ ఇన్నాళ్ళూ మనసంతా కన్నులు చేసుకుని వెతుకుతున్న అన్నూ అతనికి లభించింది. ఆమె ఎవరో కాదు మోహిత! చిన్నప్పుడు అన్నూ అనే అనాథ బాలికని పిల్లలు లేని మోహిత తలిదండ్రులు దగ్గరకి తీసి 'మోహిత' అని పేరు పెట్టి ప్రేమతో పెంచి పెద్ద చేసారు. మోహితకిది తెలియదు.తరుణ్ అన్నూ కోసం వెతుక్కుంటూ వెళ్ళిన ప్రయాణం మోహిత ఇంటి తలుపులు తట్టి 'అన్నూ'యే మోహిత అని తెలుసుకోవటంతో కథ సుఖాంతం అవుతుంది.

***

# సుకుమారి




నాకు ఈ ప్రపంచంలో ప్రతి ఆడపిల్లా, మానసికంగా, శారీరకంగా సుకుమారి అనిపిస్తుంది. భగవంతుడు ఆమె మనసునిండా ప్రేమనిచ్చి, ఆమె శరీరానికి సౌకుమార్యం ఇచ్చి, ఆమె తెలివితేటలకి పరీక్ష పెట్టినట్టు ఈ ప్రపంచం అనే ముళ్ళకంపలో పడేశాడు అనిపిస్తుంది. ఎటుచూసినా, ఏ వయసులో చూసినా, ఆమెకి శారీరకంగా, మానసికంగా అంతులేని గాయాలు - అంతుపట్టని వ్యధలే. నేను నా చుట్టూ చాలామంది స్త్రీలని చూసాను. వారు శారీరకంగా, మానసికంగా చాలా బాగుంటారు. కానీ వారి జీవితాల్లో భర్తల పేరిటో - తలితండ్రులు - అత్తమామలో ఏదో విధంగా జీవితంలో ఒక తోడేలులాంటి క్రూరత్వం ఎదుర్కొంటారు. వారి తెలివి - వయసు - అందం అన్నీ బూడిదలో పోసిన పన్నీరే.

ఆడపిల్లకి అసలు శత్రువు ఆమె మనసే అనిపిస్తుంది. అదెప్పుడూ 'భర్త - పిల్లలూ ' చిన్నదైనా ముద్దుగా వుండే సంసారం అనే కలలో మునిగి తేలుతూ వుంటుంది.ఆ కలని సాకారం చేసుకోవటం కోసం, ఎన్ని కష్టాలయినా భరిస్తుంది. ఓర్మిని తెచ్చుకుంటుంది. నాకు చిన్నప్పటినుంచీ స్త్రీలు ఇంత ఓర్మి పట్టటం నచ్చేది కాదు. బహుశా దానికి కారణం మా పిన్ని (మా నాన్న తమ్ముడి భార్య) మా బాబాయి చేతిలో తినే తన్నులే కావచ్చు. మా పిన్నికి చిన్నప్పుడే తండ్రి పోతే, తల్లి బంధువుల పంచన బ్రతికింది. మా పిన్నికి పదకొండో సంవత్సరంలో మా బాబాయితో పెళ్ళి అయింది. ఆయన కులాసా పురుషుడు. చుట్టలు

తెగతాగేవాడు. తొక్కుడు హార్మనీ వాయిస్తూ పాటలు పాడేవాడు. ఎప్పుడూ డ్రామాల వాళ్ళతో తిరిగేవాడు. మా పిన్నికి పద్దెనిమిది సంవత్సరాలకే ఇద్దరు పిల్లలు. బాబాయికి హఠాత్తుగా పక్షవాతం వచ్చి కుడి కాలు చేయి పడిపోయింది. జీవితం తల్లక్రిందులు అయింది. ఆయన ఏనాడూ, ఇంటి అవసరాలు గురించిగానీ, పిల్లల గురించిగానీ పట్టించుకోలేదు. పిన్నే ఆ ఇంట్లో ఈ ఇంట్లో చాకరీ చేసి ఇల్లు గడిపేది. బాబాయి అసలే సోగ్గాడు. సిగరెట్లు - చుట్టలు లేందే ఉండలేడు. హార్మనీ వాయించలేడు. క్షవరం చేయించుకోవటానికి కూడా డబ్బుల్లేవు. ఆ కోపం అంతా మా పిన్ని మీద చూపించేవాడు. అందినప్పుడల్లా ఆవిడని పట్టుకుని తనకి వూతం కోసం పెట్టుకున్న కఱ్ఱతో నెత్తురోడేట్లు చావబాదేవాడు.

నేనప్పటికి ఫిఫ్త్‌ఫారం చదువుతున్నాను. ఒకసారి పరీక్షలకి చదువుకుంటుంటే, పిన్ని ఏడుస్తూ పారిపోయి నేనున్న గదిలోకి వచ్చి తలుపులు మూసుకుంది. ఆవిడ నుదిటి మీద లోతుగా తెగిన గాయం నుంచీ రక్తం ఆవిడ జాకెట్ - చీర మీదకి నీళ్ళు ఒలికినట్లు కారిపోతుంది. నేను పరీక్ష మాట మర్చిపోయాను., ఆవిడని చప్పున పట్టుకున్నాను. గాయం తుడిచి గాయం మీద నొక్కి పట్టాను. మా నాన్న ఊరిలో లేడు. అమ్మ - అక్కయ్యలు - వదినలు - అత్తయ్యలు ఇరుగు - పొరుగు అందరూ మూగారు. "నేను ఆ కఱ్ర తెచ్చి ఇస్తాను నువ్వు బాబాయిని తిరిగి కొట్టు" అని పిన్నికి చెప్పాను. మా పిన్ని బలంగా ఉంది. అసలు ఆవిడ చెయ్యి ఎత్తితే ఆయన భూమిని కరవాల్సిందే మా అమ్మ నన్ను 'నోరుముయ్..' అంది.

పిన్ని ఎప్పుడూ ఎదురు తిరిగేదికాదు. నాన్న ఊరు నుండీ వచ్చి కేకలేస్తే ఓ నెలరోజులు ఏ గొడవా ఉండేదికాదు. మళ్ళీ మొదలు.

జీవితం నిండా దరిద్రం. కుంటి మొగుడు, ముగ్గురు పిల్లలు, బాబాయి చేత తన్నులు - తిట్లు. కడుపు నిండా ఎప్పుడూ తిండి వుండేదికాదు. అయినా మా పిన్ని ఎప్పుడూ ప్రసన్నంగా నవ్వుతూ ఉండేది. "అలా ఎట్లా వుంటావు పిన్ని" అంటే "మనచేతుల్లో ఏముందీ. ఇదంతా ఏనాటిదో పాపం, అనుభవించాల్సిందే" అనేది. 82 సంవత్సరాల వయస్సులోకి వచ్చిన పిన్నిని ఆరునెలల క్రితం మా ఊరు వెళ్ళినప్పుడు చూసాను. తల ముగ్గుబుట్టలా, ఒళ్ళంతా నాగలితో దున్నిన పొలంలా ముడుతలతో ఉన్నా ఇంకా అదే ప్రసన్నమైన నవ్వు. ఆవిడ ఇద్దరు కొడుకులు - కూతురు, ప్రేమగా చూసే మనమడు పోయాడు. బాబాయి పోయి 45 ఏళ్ళు అయింది. అయినా ఆమె ముఖంలో ఆ నవ్వు ఆమె ఆజన్మ ఆభరణంలా ఉంది. ఆమె అమాయకురాలా! అంటే కాదు. ఒక చిన్న వేదాంతం 'అంతా నా ఖర్మ' అని నమ్మి దాన్నే లైఫ్ బోట్‌గా తీసుకుని కష్టాల కడలి సులభంగా దాటేసింది. పెళ్ళి ఆమెని నిలువు దోపిడీ చేసిందని నా నమ్మకం.

ఇలాంటి వాళ్ళు లక్షలు - కోట్లు మనదేశంలో వున్నారు. ఈ బాధలకి జాతిబేధంగానీ, కులమత వివక్షత గానీ, కలిమి లేమి అనే తేడా గానీ లేదు. అందరు స్త్రీలు నాకు మూసపోసినట్లు ఒక్కటిగానే అనిపిస్తారు. వీళ్ళలో శక్తి ఉంది. కానీ తెలుసుకోరు. అసలు తెలుసుకోవటానికి ఇష్టపడరు. ఆరోజున బాబాయి పిన్నిని ముఖం మీద అంత గాయం అయేట్టు కొట్టినప్పుడు ఒక్క స్త్రీ కూడా వెళ్ళి 'నీకు బుద్ధుందా' అని ఆయన్ని తిట్టలేదు. స్త్రీకి స్త్రీ తోడుంటే, చాలా సమస్యలని ఆమె ఎదుర్కోగలదు.

స్త్రీ సంఘటిత శక్తి ఎంత బలమైనదో, అది ఒళ్ళు విరిస్తే తమ చిరునామాలకే శలవు వస్తుందని తెలుసుకున్న పూర్వీకులు, తెలివిగా, స్త్రీ సాటి స్త్రీతో ఐకమత్యంగా ఉండకుండా, ఎప్పుడు, ఈర్ష్యపడేలా, పోట్లాడేట్లు ఆమె ప్రభావాన్ని మరిగుజ్జు మొక్కని చేసినట్టు అంటుగట్టి చాలా జాగ్రత్తపడ్డారు.

స్త్రీ ఇందులో నుంచీ బైటపడాలనినాకెప్పుడూ అనిపించేది. ఈ ఊహల ఊపిరే 'సుకుమారి' అని పేరు పెట్టాను.

నేను కావాలనే 'సుకుమారి' అని పేరు పెట్టాను. స్త్రీ శారీరకంగా' 'సుకుమారి' కావచ్చు. కానీ మానసికంగా కాదు. నీ కన్నీళ్ళని నీ చేత్తో నువ్వే తుడుచుకోవాలి. అది ప్రథమ పాఠం. అసలు నీ కళ్ళలోకి నిస్సహాయతని చూపే నీళ్ళు రాకుండా చూడటం ఇంకా ముఖ్యం. నీ జీవితం కోసం నువ్వే పోరాటం చేయాలి. పెళ్ళి కావాలనుకున్నా - వద్దనుకున్నా అది నీ నిర్ణయం అయివుండాలి. అంత మానసిక స్థాయికి నువ్వు ఎదగాలి. ఇదే అందులో సందేశం. అతి ఛాందస కుటుంబంలో పుట్టిన గ్రామీణ బాలిక సుకుమారి, ఇష్టం లేని పెళ్ళి నుండీ బైటపడి, తన జీవిత గమ్యం తను ఎంచుకుంది. అందుకు ఆమెకి ఆమె స్నేహితుడు 'బ్రహ్మీ' తోడునీడగా వున్నాడు. ఈ నవల - పెళ్ళికాని అమ్మాయిలకి - పెళ్ళి అయినవారికి కూడా బాగా నచ్చింది. వాళ్ళ ఆంతర్యపు అట్టడుగు పొరల్లోంచీ వచ్చిన సుకుమారిని అభిమానించారు. వారికి తెలిసిన అమ్మాయిగా ఇంకా అభిమానిస్తున్నారు.

అప్పుడప్పుడు ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా నా ఈ నవలల పునర్ముద్రణ చూస్తుంటే, నేను నాచుట్టూ చూసిన పాత్రలకి, నేను కొంచెం వన్నెలు చెక్కి వీరి ముందు పెట్టి - వీరి మన్ననలు అందుకుంటున్నాను అనిపిస్తుంది.

బాధలు చాలా మంది పడతారు.

కొద్ది మందే ఎదుర్కొని విజయం సాధిస్తారు.

ఆ విజయాన్ని తమ విజయంగా ఆనందిస్తారు మిగతా అందరు. నేను ఇది సుకుమారి కథగా రైటర్ చెప్పినట్టుగా వ్రాయలేదు. 'నేను సుకుమారిని' అంటూ ఫస్ట్ పర్సన్‌లో వ్రాసాను. అందువల్ల నవలగా కంటే 'సుకుమారి' స్వయంగా తమతో మాట్లాడినట్లున్న నవల అని ప్రశంసల జల్లు అభిమాన పాఠకులు నామీద కురిపించారు. ఇది నిజంగా అదృష్టమే అనిపిస్తుంది.

***

# ప్రేమసింహాసనం

**నా దగ్గరకి ఎంతో మంది పాఠకులు వస్తుంటారు.** వచ్చిన కొద్దిసేపు మాత్రమే వారికి నన్ను చూడటంలో వున్న ఆనందం కుతూహలం నిలువరిస్తాను నేను. తర్వాత మెల్లగా వారి జీవితం గురించి, యోగక్షేమాలతో మొదలు పెట్టి - వారి సాధకబాధకాలు ప్రశ్నలు వేస్తాను. అంతే. వారు, వారి హృదయకవాటాలు తెరిచేసి, నన్ను చేయిపట్టిలాక్కెళ్ళి చూపినట్టే వారి జీవితాల అవలోకనంలోకి నన్ను తీసుకు వెళ్ళిపోతారు. కొంతమంది జీవితానుభవాలు వింటుంటే, చాలా విధాలుగా, మనలాటి వాళ్ళు ఎంతో అదృష్టవంతులం అనిపిస్తుంది. ఎన్నెన్ని బాధలు, ఎన్నెన్ని మౌన రోదనలు! ఎన్నెన్ని నిశబ్దత్యాగాలు. బాబోయ్! ఒక్కొక్కసారి ఈ పాఠకుల జీవితాలు వింటుంటే, మనం ఏనాడు చేసుకున్న పుణ్యమో ఈ సుఖమయ జీవితం అనిపిస్తుంది. చిన్న తప్పులకి పెద్ద శిక్షలు, చిన్న అమాయకత్వాలకి, గుది బండలాంటి భవిష్యత్తులు.




మా ఇంటికి నన్ను చూడటానికి వచ్చిన ఒకామె చెప్పింది. ఆవిడ జీవితం అంతా విషాదమే. పేదకుటుంబం. చక్కదనం ఉన్నా కట్నం ఇవ్వలేక పాన్‌షాపు నడిపే ఒకతనికి వయసు తారతమ్యం ఎక్కువున్నా, ఇచ్చి పెళ్ళి చేశారు. అతనికి పోలియోవల్ల ఒక కాలు, చేయి పనిచేయదు. షాపంతా ఈవిడే నడిపేది. అందులోనే తనకి చాతనైన జంతికలు, కారప్పూస, లడ్డూలు, పచ్చళ్ళు పెట్టి షాపుని పెంచేసి, పాన్‌షాపుకి వచ్చే మగవాళ్ళకి ఇవన్నీ అంటగట్టి, వారి కుటుంబాలకి దగ్గరైంది. ఆవిడకి ఇద్దరు పిల్లలు. ఫోటోలు బాగ్‌లోంచీ తీసి చూపించింది. ఆవిడలాగానే బాగున్నారు. పెద్దమ్మాయి అచ్చు తల్లి పోలిక. చిన్నపిల్లలో అంతగా ఆమె పోలిక లేదు. ఆ పిల్లల గురించి ఆమె చెప్పిన విషాద

వార్తలు విని తెల్లబోయాను. పెద్దమ్మాయికి 18 సంవత్సరాల వయసులో, చేతికింద సాయం ఉంటాడని పెట్టుకున్న తమ్ముడే నాశనం చేసాడు. చిన్నపిల్ల ఆవేశంతో అతన్ని కూరగాయలు కోసే కత్తితో పొడిచింది. కేసయింది. అతనికి డయాబిటీసవడం వల్ల గాయం నయం అవక చనిపోయాడు. కేసు నడిచింది. ఆ అమ్మాయి కొద్దిరోజులే జైలులో ఉన్నా విడుదలైపోయింది.

ఈ సంఘటనతో వాళ్ళ కుటుంబం స్థితే మారిపోయింది. విశాఖపట్నం నుంచీ హైదరాబాదుకు వచ్చేసారు. ఈ సంఘటన దాచి ఆ అమ్మాయికి పెళ్ళి చేయాలని చూసారు. కానీ మధ్యవర్తి కుర్రాడికి చెప్పేసాడు. అయినా ఆ అబ్బాయి ఇష్టపడి చేసుకున్నాడు. పెళ్ళి అయింది. భార్యాభర్తలు బాగానే ఉన్నారు. కానీ విశాఖపట్నం బంధువు ఆ అమ్మాయి భర్తకి దూరపు బంధువు. మెల్లగా విషయం తెలిసింది. ఆ అబ్బాయి భార్యకి తనకిదంతా తెలుసని భయపడవద్దని చెప్పాడు. అయినా ఆ అమ్మాయి వినలేదు. భయమో లేక ఆందోళనో తెలియదు. ఇంటికి వచ్చిన ఆ బంధువుని రాత్రి మంచినీళ్ళలో స్లీపింగ్ పిల్స్ వేసి ఇచ్చి చంపేయాలనుకుంది. అతను చావుబతుకుల నుండీ బయటపడ్డాడు. ఈ అమ్మాయి చేసిన అఘాయిత్యం బైటపడింది. పెద్ద గోల అయిపోయింది. అది భరించలేక ఆ అమ్మాయి ఉరేసుకుని చచ్చిపోయింది. చూడండి! ఆ అమ్మాయి జీవితం తన తప్పు లేకుండా ఎక్కడి నుంచీ ఎక్కడికి దొర్లిపోయిందో!

మా ఫ్రెండ్ ఒకామె సోషల్ వర్కర్. ఆమెకి జైలులో శిక్షలు అనుభవించే ఆడఖైదీలకి ఇంటర్వ్యూలు చేయడం అలవాటు. అది ఆవిడ హాబీ. ఆవిడ చెప్పిన ఇంటర్వ్యూలు వింటుంటే, మనలాటి వాళ్ళకు రాత్రిళ్ళు నిద్రరాదు. జీవితం అంటే భయంకరమైన అనుభవం. విషాదం తప్ప ఇంకేదీ కాదు అనిపిస్తుంది.

ఇలాటి కథలు విన్న తర్వాతే ఒక అమ్మాయి తపనగా 'ప్రేమసింహాసనం' వ్రాసాను.


నేను పాఠకుల ద్వారా విన్న ఎన్నో విషాద చరిత్రలలోనుంచీ 'స్వప్న' క్యారెక్టర్ వచ్చింది. నేనెప్పుడూ పాఠకులకి, నా నవలల ద్వారా జీవితంలో ఎన్ని కష్టాలు వున్నా వెతుక్కుంటే 'సంతోషం' అనే 'లైట్‌హౌస్' తప్పక కనిపిస్తుందని అంతర్లీనంగా బలీయమైన మెస్సేజ్ ఇస్తాను. ఆశలేకపోతే మనిషి రావాల్సిన మరణానికి ముందే చచ్చిపోతాడని నా నమ్మకం. ప్రతివ్యక్తి జీవితం ఒక రామాయణమో భారతమో, తప్పక అయి ఉంటుంది. పోరాడటం తప్పని సరి అని మన పురాణాలు అన్నింట్లోనూ మనకి 'పాఠం' వుంది

ప్రేమ సింహాసనం నవలలో కథానాయికి 'స్వప్న' అనుకోని పరిస్థితుల్లో ఒకతన్ని హత్యచేస్తుంది. కానీ అదృష్టవశాత్తు 'సుధీర్' అనే మంచి లాయర్‌తో ఆమె వివాహం జరుగుతుంది. స్వప్న జీవితంలో అదృష్టం ఉదయించినా, కష్టాలు ఆమెని వదలవు. సంఘం అసలు ఆమెని వదలదు. ఒక పక్క ప్రేమించే భర్త, ఇంకో పక్క తన గతాన్ని మర్చిపోనివ్వని మనుష్యులు. ఆమె అనాధగా, పేదరాలుగా వున్నప్పుడు ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ సుధాకర్ భార్యగా అయినప్పుడు మాత్రం అందరికీ ఆమె సంగతే కావాలి.

జీవితంలో అదృష్టం వచ్చినా, అది అనుభవించనీయకుండా, క్షణం క్షణం బాధలు ఎదురైన ఎంతోమందికి ఈ'స్వప్న' ప్రతిరూపం. అందుకే కొంతమందికి ఈ నవల చాలా ఇష్టం.

***

# అగ్నిపూలు




ఈ రోజుల్లో మనిషికి డబ్బు ఉండటం - లేకపోవటం అనేది, మనిషికి ప్రాణం ఉండటం - లేకపోవటంతో సమానం అయిపోయింది. మన జీవితాల్లోకి చొచ్చుకు వచ్చిన ఈ డబ్బు అందమైన రాక్షసి అంటుంది నా స్నేహితురాలు. నేను కాదని అంటాను. ఈ ప్రపంచంలో ఏ విషయం అయినా మోతాదు మించితే ప్రమాదమే గాలిని చూడండి. కాస్త నెమ్మదిగా వీస్తే మనం కూర్చున్న చోటు నుంచీ కదలకుండా హాయిని అనుభవిస్తాం. అదే ప్రచండ వేగంతో వచ్చిన గాలి అనుకోండి. మనం కొట్టుకుపోతాం. కొట్టుకుపోతున్నాం అని తెలిసి కూడా మనల్ని మనం రక్షించుకోలేని నిస్సహాయత్వం. నీరయినా, ఎండయినా ఏది అతి అయినా అంతే. మన ఉనికీ నశిస్తుంది. ఎందుకోగానీ భగవంతుడు మనకి అన్ని తెలివితేటలు ఇచ్చి ఆశీర్వదించి - 'నీకు తృప్తి అనేది మాత్రం' ఉండదు అని శపించినట్టు అనిపిస్తుంది. ప్రస్తుతం మనిషి డబ్బు సంపాదన అనే విషయంలో ఇది అక్షరాలా నిజం అనిపిస్తుంది. మనిషికి ఎంత సంపాయించినా తృప్తిలేదు. అద్దె ఇంట్లో ఉంటే 'ఇది చాలా ఇరుకు స్వంత ఇల్లు కావాలి. కనీసం ఒక బెడ్‌రూమ్‌ది అయినా చాలు' అనుకుంటాం. అదృష్టం కలిసి వచ్చి మన కోర్కె సాఫల్యం అయి అందులోకి వెళితే, అదీ కొన్నాళ్ళకి చాలనట్టే ఉంటుంది. టు బెడ్‌రూమ్‌ది కొన్నా - ఇంకా వెలితి. ఇంకా పెద్ద ఇల్లు. చాలా హంగులున్నది కావాలని అనుకుంటాం. నగలు కొంచెం ఉంటే చాలవు. చాలా కావాలి అనుకుంటాం. అన్నీ... ఇంకా ..ఇంకా.. కావాలి. ఉన్నవాటితో శాంతిలేదు తృప్తిలేదు. కొంత మంది అయితే మరీను. తమకి ఎన్ని ఉన్నా పక్క వాళ్ళది కాజేయాలని చూస్తారు.

మనలో చాలామంది డబ్బు ఎక్కువ ఉంటే ఎక్కువ సుఖపడగలం అనే వెర్రినమ్మకంలో ఉంటారు. డబ్బుకి బంధుత్వాలు - అనుబంధాలు - ప్రేమలు ఏమీలేవు. డబ్బు పట్ల నీకు సరైన జ్ఞానం లేకపోతే, దాని విలువ నీ జీవితంలో నువ్వు బిగించకపోతే - అది బుల్ డోజర్‌లా నీ జీవితాన్ని దున్నేస్తుంది. నీ విలువలు - నమ్మకాలు -

ప్రేమలూ అన్నింటినీ ధూళిగా మార్చేసి నిన్ను మానసికంగా బికారిని చేస్తుంది. మనిషికి డబ్బు సంపాయించటంలో ఎంత ప్రావీణ్యత కావాలో, అది తన జీవితాన్ని కూకటి వేళ్ళతో తెంచకుండా ఆపేసే బలీయమైన సామర్థ్యం అంత కంటే రెట్టింపు కావాలి.

నా అదృష్టం - నా రచనలు నన్ను కుల - వర్ణ - మత - వివక్షతలేకుండా చాలామంది మనుష్యులకి దగ్గరయి వారి ఆత్మబంధువుని చేసి, వారి కష్ట సుఖాలు చెప్పుకునేలా చేసాయి. నాకు విపరీతమైన డబ్బు ఉండి కూడా, కాస్త అయినా మనశ్శాంతి లేకుండా, ఒంటరితనంతో మగ్గిపోయే పెద్ద కుటుంబాల స్త్రీలు తెలుసు. తెల్లవారి లేస్తూనే, జుట్టు పైకి ఎగ కట్టి - పది ఇళ్ళలో పని చేసి పన్నెండు గంటలకల్లా ఇంటికి చేరి, ఉన్నదేదో తినేసి టీ.వీ ముందు కూర్చుని, ఆ సీరియల్స్ చూస్తూ - కన్నీళ్ళు కారుస్తూ, సంతోషాలు అనుభవించేస్తూ - హాయిగా రోజు గడిపేసి పనిచేసుకునే స్త్రీలు తెలుసు.

నేను అప్పుడప్పుడు మా ఇంటికి పనికి వచ్చే లక్ష్మిని చూస్తుంటాను. భర్త తాగుబోతు. పిల్లలు చెప్పిన మాట వినరు. అయినా లక్ష్మి మొహం ఆనందంతో నిండి ఉన్న పూర్ణకలశంలా ఉంటుంది. అంతక్రితం రోజు చూసిన టీ.వీ సీరియల్స్ గురించి నాకు చెప్పేస్తూ - గిన్నెలు తోమేస్తూ - గలగల మాట్లాడేస్తూ - నవ్వేస్తూ - పక్కింటికి పనిచేయటానికి రేసు గుఱ్ఱంలా పరిగెత్తేస్తుంది. లక్ష్మి సంతోషంతో పది ఇళ్ళ పని సులభంగా చేసి పన్నెండు గంటలకి ఇంటికి పరుగెత్తి టీ.వీ ముందు వాలిపోతుంది. నా ముఖం ఎప్పుడు చూసినా, ఈ భూమి మీద సమస్యలు అన్నీ నేనే మోస్తున్నట్టు స్ట్రెస్‌తో బడలికగా ఉంటుంది. నాకున్న డబ్బు ముందు - వసతుల ముందు లక్ష్మికి వేయో వంతు - నూరో వంతు కూడా లేదు. ఏమిటీ సంతోషానికి తులాదండం? ఆలోచిస్తుంటే నాకు అద్దంలో చూసినట్టే జవాబు దొరికింది. లక్ష్మి ఈ రోజుకి - ఈ రోజు - కాదు - ఈ నిమిషానికి ఈ నిముషం బ్రతికేస్తుంది. నేను! 30 సంవత్సరాల కి నా భద్రత కోసం - సుఖశాంతుల కోసం ప్లాన్స్ వేస్తుంటాను, నేనెప్పుడూ ఈ క్షణంలో బ్రతకను! అందుకే నాకు ఇంత వయసు ఎప్పుడు వచ్చేసిందా? ఎప్పుడు ఇన్ని సంవత్సరాల కాలం చిల్లుకుండలో నీరులా నాకు తెలియకుండా ఇనికిపోయిందా అని ఖంగారు - ఆవేదన పడుతుంటాను. నాకూ - లక్ష్మికి ఇంకో పెద్ద తేడా ఉందని కూడా తెలుసుకున్నాను. నా నెత్తిమీద ఇన్నాళ్ళూ నేను మోస్తున్న ఈ పేరు - పెద్ద భ్రమ అని తెలుసుకున్నాను. ఇది మనిషి జీవితంలో మోసే పెద్దమూటలు. ఇవి చాలా భారం. అదెక్కడ పడిపోతుందో అని, బాలెన్స్ చేసుకోవటంలోనే జీవితం అయిపోతుంది.

మనిషికి ఆస్థిఅయినా - కీర్తిప్రతిష్టల సంపద అయినా, దాన్ని మోసుకుంటూ నడవటం టైట్ రోప్ వాకింగే. నా చిన్నప్పుడు మా ఊళ్ళో తాడు మీద దొమ్మరిపిల్ల నడుస్తుంటే నాకు చాలా అద్భుతంగా ఉండేది. ఒకసారి ఆ అమ్మాయిని 'ఎంత బాగా చేస్తున్నావు! నువ్వు చాలా గొప్పదానివి' అని మా అత్తయ్య అంటే 'ఏంబాగో అమ్మగారూ తాడెక్కిన ప్రతిసారీ - మా అక్కలాగా క్రిందపడి ఎక్కడ నడుం విరక్కొట్టుకుంటానో అని బయంతో నడుస్తుంటా.' అంది

పాఠకుల్లో కొంత మందికి నామీద అసంతృప్తి. డబ్బున్న వాళ్ళ కష్టాలు వ్రాస్తారెందుకు! డబ్బుంటే అసలు బాధలేముంటాయి? అని నామీద సణుగుతారు. ఇదే సగం మందిలో భ్రమ! డబ్బుంటే బాధలుండవని! డబ్బుతో వచ్చే బాధలున్నాయి. డబ్బులేకపోయినా వచ్చే వ్యధలు చాలా ఉన్నాయి. నాకు తెలిసిన వాళ్ళలో వివిధ ఆర్థిక స్థితికి చెందిన స్త్రీలు ఇద్దరున్నారు. "ఒకామె అంటుంది "డబ్బుంటే మనిషికి ఎంతో హాయి, స్వేచ్ఛ' అంటుంది. ఈమె మధ్యతరగతి

మనిషి. ఇంకో ఆమె పుట్టింటి నుంచీ కోట్ల ఆస్థి వచ్చింది. భర్త పెద్ద పదవి చేసి చాలా సంపాయించాడు. అయినా ఆవిడకు సంతోషం లేదు 'ఏంచేసుకుంటాం డబ్బు. నాలిక గీసుకుంటామా! మనిషికి స్వేచ్ఛ - సంతోషం ఉండాలిగాని.' అంటుంది, ఆమె జీవితం డబ్బుతో పడని బాధలేదు ఆమె మీద ఆస్థికి అక్క దావా వేసింది. భర్తకి ఆ ఆస్థి ఎక్కడ పోతుందో అని తపనగా ఉండేది. ఈవిడకి సరదాగా తిరగటం - ఆనందంగా గడపటం ఇష్టం, జన్మలో అది ఆవిడకి లభించలేదు. ఈ ఇద్దరు స్త్రీలు చెప్పింది నిజమే. సంతోషం అనేది డబ్బులో లేదు.

నా దగ్గరకి పబ్లిషర్స్ వచ్చినా - నిర్మాతలు - డైరెక్టర్స్ వచ్చినా - పాఠకులు వచ్చినా - చందాలు అడిగేవారు వచ్చినా - ఈ డబ్బు ప్రసక్తి రాకుండా ఎప్పుడూ ఉండేది కాదు. ఒక్కోసారి ఆలోచిస్తే - నేను 'నాది' అనుకుంటున్న ఈ ప్రపంచంలో ఇది ఎంత ప్రధాన పాత్ర వహించిందో అనిపిస్తుంది.

ఈ డబ్బు - ఆస్థులు - నమ్మకాలు - అనుబంధాలు - మోసాలు - స్వార్ధాలు - కక్షలు - కార్పణ్యాలు ఇవన్నీ నా మనసులో ఎప్పుడూ తొలుస్తూ ఉండేవి. ఆస్థుల కోసం అతి భయంకరంగా కొన్ని కుటుంబాల్లో నిశ్శబ్దంగా జరిగిన దారుణాలు వింటే - శరీరం జలదరిస్తుంది. మనిషిని వద్దనుకుని డబ్బుకావాలని పోగుచేసుకునే మనిషికి చివరికి ఏం మిగులుతుంది? డబ్బు ఆనందం ఇచ్చే వెన్నెలే కాదు - నిప్పులు కక్కే అగ్నిపూలుగా కూడా మారగలదని నాకు అర్ధమయింది.


నా ఈ నవల 'అగ్నిపూలు' అని పెట్టటానికి కారణం ఉంది. నేను నాకుటుంబంతో చాలా సార్లు హైదరాబాద్ యాదగిరిగుట్టలో దేవుని దర్శనానికి వెళ్ళేదాన్ని. పొద్దున వెళ్ళి సాయంత్రం తిరిగివస్తుంటే - రోడ్డు కిరుప్రక్కలా తంగేడు పూలచెట్లు (Flame of the forest) చెట్లు కనిపించేవి. పెద్ద గుత్తులు విరగబూసి ఉండేవి. సాయంత్రం - అస్తమిస్తున్న సూర్యుడి కెంజాయి రంగు అంతటా ఆవరించాక ఆ కాంతిలో ఆ ఎర్రటి పూల శోభ అక్కడంతా ఎర్రటి మంటల్లా చూడటానికి అందంగా - భయంగా కూడా ఉండేది. నా కెందుకో వాటిని చూసిన కొద్దీ మనుష్యుల ఆంతర్యాల్లో డబ్బు పట్ల ఉన్న వ్యామోహం గుర్తుకు వచ్చేది.

నాకు అప్పటికి నవల గురించి ఏ ఆలోచనా లేదు. సాయంత్ర సమయాలు ఆ ఎర్రటిపూలు, ఆ దృశ్యం అప్పుడప్పుడూ నన్ను వెంటాడేది. తర్వాత ఎమెస్కోవారికి ప్రతి సంవత్సరం ఏప్రిల్లో 'శ్రీరామనవమి'కి ఒక నవల వ్రాసే ఎగ్రిమెంట్‌లో ఈ 'అగ్నిపూలు' ఉదయించింది.

అగ్నిపూలు నవలలో కృష్ణచైతన్య అనే మానవత్వం నిండిన మంచి మనిషి చుట్టూ కథ తిరుగుతుంది. అతని తల్లి - అమ్మమ్మ - ప్రేమించి పెళ్ళిచేసుకున్న డాన్సర్ రుక్మిణి యాక్సిడెంటులో కాళ్ళు పోవటం - ముద్దులు మూటగట్టే కొడుకు, పనిమనిషి నీలి, హఠాత్తుగా, ఈ ఆస్థికి అసలు వారసులయిన, జేనీ, బాబి, అమెరికా నుంచి రావడం, జేనీలో కృష్ణచైతన్య పట్ల ప్రతీకార ద్వేషం - ఈ పిల్లలు వచ్చారు, ఆస్థి ఎక్కడ తన్నుకు పోతారో అని - కలవర పడే తల్లిని అతను సముదాయించటం - జేనీ తల్లి - తండ్రి గురించిన ఫ్లాష్‌బ్యాక్. కుటుంబ మిత్రుడు అయిన డాక్టర్. స్థూలంగా చూస్తే - ఇది మంచి మనిషి, మానవతామూర్తికి (హీరో కృష్ణ చైతన్యకి), డబ్బు లాలసలో పడి కుటుంబ సభ్యుల్ని కూడా నిర్దాక్షిణ్యంగా చంపగల స్వార్ధానికి జరిగిన ఘర్షణే 'అగ్నిపూలు' నవల పాఠకులకి చాలా ఇష్టం. అది ఇప్పటికీ పునర్ముద్రణలు వస్తూనే ఉంది. కృష్ణంరాజు - జయప్రద - జయసుధ మొదలైన తారలతో సురేష్ మూవీస్ అధినేత శ్రీ డి.రామానాయుడు సినిమా తీసారు. దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత కొత్త తరం డైరక్టర్స్ - నిర్మాతలు మళ్ళీ దాన్ని టీ.వీ సీరియల్‌గా తీయాలని ముందుకు వస్తున్నారు. కొన్ని సబ్జక్ట్స్‌కి 'పాతపడటం' అనేది ఉండదు మరి.

***

# నీరాజనం




అమ్మ నా చిన్నప్పుడు ప్రతిరోజూ వంట పూర్తి అవగానే, వెండికంచంలో అన్నం, పప్పు, కూరలాటి ఆరోజు వండిన వన్నీ పెట్టి, దేవుడికి పూజ చేసి, ఆ కంచంలో వన్నీ నైవేద్యం పెట్టి, చివరలో హారతి ఇచ్చి తను కళ్ళకు అద్దుకుని, మమ్మల్ని అద్దు కోమనేది. ఆ వయసులో పుస్తకం చదవటం మీద ఉన్న ఇంట్రెస్ట్ భగవంతుడిమీద ఉండేది కాదు. ఒకరోజు అమ్మని అడిగాను. "ఎందుకలా హారతి ఇవ్వటం' అమ్మకి పెద్దవాళ్ళు చెప్పినది ఆచరించటమే తప్ప ప్రశ్నలు వేయటం తెలియదు అనుకుంటా. విననట్టు ఊరుకుంది. నాన్న దగ్గరకు తీసుకుని చెప్పారు. హారతిలో 'జ్యోతి' మన 'ఆత్మ! అది భగవంతుడికి అర్పించుకోవటం అన్నమాట. 'ఆత్మ' అంటే అని అడిగేలోపలే నాన్న కోసం ఎవరో రావటం వల్ల వెళ్ళిపోయారు.

తర్వాత తర్వాత హారతిని, 'నీరాజనం' అని కూడా అంటారని తెలిసింది. ఆ పేరు అంటే నాకు చాలా ఇష్టం. మనని మనం ఎవరికైనా అర్పించుకుంటే అది నీరాజనమే అంటే, నా ఈ దేశంలో నూటికి 98 మంది స్త్రీలు తమ జీవితాన్ని తమ భర్తకి - సంసారానికి 'నీరాజనం' పట్టినట్టే కదా అనుకునేన్ని. 'నీరాజనం అనే మాట నా భావనా తరంగాల్లో ఒక్కసారి ఉవ్వెత్తున లేచి వెళ్ళిపోతూ ఉండేది. ఒక్కోసారి ఇష్టమైన పేరు పెట్టి దాని చుట్టూ 'నవల' అల్లటం నాకు అలవాటే.

ఆ విధంగానే 'నీరాజనం' నవల వ్రాసాను.

'నీరాజనం'లో హీరోయిన్ పేరు మేనక. కథ ఆమె చుట్టూ తిరుగుతుంది. ఆమె జీవితమే ఒక కథ అనిపిస్తుంది. చాలా సార్లు నవలల్లో మెయిన్ థీమ్ హీరో హీరోయిన్‌దే అయినా , ఒక్కసారి వారితో సమంగా - వారి ప్రక్కన ఉండే క్యారెక్టర్స్ డామినేట్ చేస్తాయి. 'నీరాజనం' నవలలో మేనక 'అమ్మమ్మ' పాత్ర అంటే అందరికీ చాలా ఇష్టం అయింది. అసలు అలాటి వ్యక్తి జీవితంలో ఉంటే ఆడపిల్ల 'ఒంటరితనం' అనేది తెలియకుండా బ్రతుకుతుంది అనేవారు పాఠకులు. మేనక ప్రసక్తి అంటే మేనక అమ్మమ్మే హీరోయిన్ అనేవారు. ఆవిడ పాత్రకి ఊపిరి నేను నా వెనకటి తరంలో చూసిన స్త్రీలే. మాకు తెలిసిన ఒకావిడ ఉంది. ఆవిడ కూతురుని భర్త వదిలేసి వేరే ఆమెతో ఆ

ఊళ్ళోనే కాపురం పెట్టాడు. అత్తగారికి – అల్లుడంటే మహా మంట. ఉన్నదంతా పణం పెట్టి కట్నకానుకలు ఇచ్చి పెళ్ళి చేస్తే – కూతురు అసలు ఎప్పుడూ అత్తారింటికి వెళ్ళలేదు. పై నుంచి ఇద్దరు మగపిల్లలు. ఆవిడ కూతురుని మనమల్ని పోషించలేక నానా అవస్థపడేది. అందరినీ డబ్బు అప్పులు అడిగేసేది. మళ్ళీ ఇచ్చేదికాదు. ఎవరింటికైనా వస్తే వాళ్ళ దొడ్లో కూరగాయలు అడగకుండా కోసుకుని కొంగులో వేసుకుని వెళ్ళేది. మగదిక్కులేని సంసారానికి తనే మగదిక్కులా ఉండేది. ఎత్తుపళ్ళు, జుట్టు ఎప్పుడూ పైకి లాగి ముడేయటం వల్ల నుదిటి మీద పైకి పోయి పెద్ద నుదురులా ఉండేది. ఆవిడ కళ్ళూ, ముక్కూ పెద్దవే. కళ్ళు మూసుకుని ఆవిడని గుర్తుచేసుకుంటే గళ్ళ లుంగీ, నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్న రౌడీ గుర్తుకు వస్తాడు. ఎవరయినా డబ్బు అవసరం అని బకాయి గురించి నసుగుతూ అడిగితే 'ఇస్తాలే ఈలోపల నువ్వేం చచ్చిపోవు.' అని డబాయించేది. అందరూ ఆవిడ మళ్ళీ అప్పు అడక్కుండా బ్రతికితే చాలు దేవుడా అనుకునేవారు. ఎలాటి మొహమాటం లేకుండా ఊరిమీద పడి అందరి దగ్గరా తన అవసరాలకి సామను దండుకుని బ్రతికేసేది.

'ఈవిడ స్త్రీ రూపంలో ఉన్న మగాడు' అనేవాడు మా బాబాయి.

నాకు ఆవిడంటే చాలా కుతూహలంగా, ఇష్టంగా ఉండేది. పూర్తిగా ఆవిడ స్వభావంకాకపోయినా, ఆవిడ అంశతో 'మేనక' అమ్మమ్మగా నా కథలో ఆవిడ అవతారం ఎత్తింది. అమ్మమ్మ క్యారెక్టర్ దొరకగానే నాకు కథ వ్రాయటం సులభం అయిపోయింది.

ఇది మూడు తరాల స్త్రీల కథ. పెద్దావిడ అమ్మమ్మ ఆవిడ కూతురు అందగత్తె. ఒకాయన ఇష్టపడతాడు. వీళ్ళ ఇంటికీ చాటున వచ్చి వెళుతుంటాడు. పిల్లలు పుడతారు. వారిలో పెద్దమ్మాయే మేనక. అమ్మమ్మ వయసు వచ్చిన మేనకకి పెళ్ళి చేయాలని చాలా ఎత్తులు వేస్తుంది. పక్కింటి కుఱ్ఱాడిని పిండి వంటలు తినిపించి పెళ్ళిలోకి దించాలనిచూస్తుంది. అతను అన్ని తిళ్ళూ తిని మేనకని చేసుకోనని, పైనుంచీ చకవగా మాట్లాడి వెళ్ళిపోతాడు. పెద్దావిడకి ఇది చెప్పు దెబ్బలా అవుతుంది. అందరూ ఆ కుటుంబం చూసి, అమ్మమ్మని – మేనకని చూసి మరీ మరీ నవ్వుతారు. ఊరంతా మేనక అమ్మమ్మ పెళ్ళి ప్రయత్నం గురించి రకరకాల కథలు నవ్వులే నవ్వులు. మేనక కుచించుకుపోతుంది. తను చేయని తప్పుకి లోకం శిక్షిస్తోంది. నిస్సహాయురాలు అవుతుంది. ఈ లోకాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియదు. ఆత్మహత్యకి పాల్పడుతుంది. ఒక్క మేనకే కాదు ఈ ప్రపంచంలో ఎంతో మంది స్త్రీలు పెళ్ళి అయినవారు – పెళ్ళికానివారు– చదువుకున్నవారు – చదువులేనివారు – ఇలా నిస్సహాయంగా తమ తప్పు లేకుండా లోకం ముందు దోషులుగా నిలబడటం – మానసికంగా నిర్వీర్యులు అవటం నాకు తెలుసు. వాళ్ళకి ఆ సమయంలో చేయూత నిచ్చి 'నువ్వేం తప్పు చేయలేదు.' అని ధైర్యం చెప్పేవారుంటే వారి జీవితాలు వేరేగా ఉంటాయి.

ఆడపిల్లని పెంచటంలో ఆమెని శారీరకంగా, మానసికంగా – బలవంతురాలిని చేయటంలో – తల్లి తండ్రులు ఇంకా శ్రద్ధ వహించాల్సి అనిపిస్తోంది నాకు.

ఆత్మహత్య చేసుకోబోయిన మేనకని ఒక డాక్టరు రక్షిస్తాడు. నీ జీవితం గురించి ఎవ్వరికీ భయపడాల్సిన పని లేదని ధైర్యం చెపుతాడు. ఇద్దరి మధ్యా వయసు తేడా ఉంది. మేనకకి ఆయనంటే అపారమైన గౌరవం. జీవితంలో ప్రప్రథమంగా తనతో హేళనగాలేకుండా ఒక మంచి మనిషిగా మాట్లాడిన వ్యక్తి అతను. అతనికి మేనక కుటుంబం తెలిసిన కొద్దీ – ఆమె చిక్కుకున్న ఆ పంజరం అర్థమౌతుంది. ఇద్దరూ స్నేహం గురించి గానీ, ప్రేమ గురించిగానీ మాట్లాడరు. ఆ రెండిటికీ మించిన పరస్పర గౌరవం. ఆత్మీయత. వారి జీవితాలకి ఒక వంతెన వేస్తుంది. పరిస్థితులు

మారుతాయి. మేనక పెద్ద ఫిలిం స్టార్ అవుతుంది. డాక్టర్ జీవితంలో ఒక విషాదం. అతను జైలు పాలవుతాడు. మేనక తన కెరీర్‌ని - గౌరవ ప్రతిష్టలని - డబ్బుని తృణప్రాయంగా వదిలేస్తుంది. అయిన వాళ్ళందరికీ దూరం అవుతుంది. ఆ డాక్టర్ ని మేనకనుంచీ దూరం చేయాలని కుటుంబ సభ్యులు ఎంతో శ్రమ పడతారు. మేనక వినదు. ఆమె భవిష్యత్తుని ఆమె నిర్ణయించుకుంటుంది.

తనకి ఉన్న డబ్బు అంతా పెట్టి ఒక నర్సింగ్‌హోమ్ కట్టిస్తుంది. డాక్టర్‌ని శ్రమ పడి జైలునుండీ విడిపిస్తుంది. జీవితంలో అలిసిపోయి - ఓడిపోయి కృంగిపోయి జైలు నుంచీ వచ్చిన అతనికి మేనక అతనికెంతో ఇష్టమైన "సేవాసౌధం"లోకి అతన్ని నడిపిస్తుంది. అతని కళ్ళలో దాన్ని చూడగానే క్రమంగా తిరిగి వస్తున్న జీవకళ చూడగానే ఆమె అంతరంగం, తన జీవితం ధన్యమైందన్నంత ఆనంద పరుస్తుంది. ఆమె జీవితం అతనికి 'నీరాజనం'గా అర్పించటంలో ఆనందం రెట్టింపు అవుతుంది.

చివరగా మీతో ఒక్కమాట. ఇంతంత బాధలు రెట్టింపు అవుతాయి. ఇంత త్యాగాలు నేను వ్రాయటానికి, మీరు చదవటానికి బాగానే ఉంటాయి. కానీ ఆ జీవనపుటల్లో బ్రతికే వ్యక్తులు ఎంత బాధా పీడితులు తలచుకుంటే శరీరం జలదరిస్తుంది. నన్ను చూడటానికి వచ్చిన పాఠకులతో ఇదే తర్కిస్తాను. వాళ్ళు ఒప్పుకోరు. "అవి బాధలు నిజమే. కానీ వాళ్ళది ఎవ్వరూ ఏదీ చేయలేని వ్యక్తిత్వం. ఆ బలీయమైన వ్యక్తిత్వంతోనే వారు ఆ కష్టాలు దాటుతారు" ఒక అభిమాన పాఠకురాలు అంది. "మీ నవలల్లో - క్యారెక్టర్స్ - కథాగమనం సరే. కానీ ఆ పాత్రల వ్యక్తిత్వాలే మనల్ని ఆకట్టుకుంటాయి. పుస్తకం పట్టుకోగానే, మేం ఉండే పరిసరాలు మేం పూర్తిగా మర్చిపోతాం. పుస్తకంలో ఆ క్యారెక్టర్స్‌తో పాటు జీవిస్తాం. పుస్తకం పూర్తి అయిన తర్వాత ఆ క్యారెక్టర్లు మా ఆత్మబంధువుల్లా మేం ఎప్పుడూ మర్చిపోలేం. "

ఒక రచయితకి గాని - రచయిత్రికి గాని పాఠకుల నుంచీ ఇంతకంటే మంచి 'నీరాజనం' ఇంకేం ఉంటుంది మీరు చెప్పండి.

***

# కలల కౌగిలి

ప్రతి మనిషీ జీవితంలో ఎప్పుడో ఓసారి కలల కౌగిలిలో చిక్కుకుని బందీ అవకమానడు. దేనికో దానికోసం. ఇంజినీర్ అవాలనో, వ్యాపారవేత్త కావాలనో, మంచి గృహిణి కావాలనో, డాన్సర్ కావాలనో, సంఘసేవిక కావాలనో, అంతరిక్షయాత్రికురాలు కావాలనో, చిన్న షాపు పెట్టుకోవాలనో, ఒక్కసారి అయినా టీ.వీలో కనబడాలనో, ఇలా వేల, లక్షల కలలు ప్రతి మనిషికి మదిలోనూ అంతర్గతంగా ఇమిడి ఉంటాయి. కొంతమంది వెరపు లేకుండా తమ కలల గురించి బాహాటంగా చెప్పేస్తారు. మరికొంతమంది తమ కలల గురించి చెప్పరు. బిడియంతో గుండెల్లో దాచేసుకుంటారు. మనది వాక్స్వాతంత్ర్యం ఉన్న దేశం అంటారు. అది రాజ్యాంగం వరకే పరిమితం అని నాకు అప్పుడప్పుడు అనుమానం వస్తుంది. ముఖ్యంగా స్త్రీల విషయంలో వాక్ స్వాతంత్ర్యానికి చాలా అడ్డుగోడలు కట్టేసిన సంఘం మనది. స్త్రీ నోరు విప్పింది అంటే సంఘం నోరెత్తలేని విషయాలు చాలా ఉన్నాయని అందరికీ తెలుసు. స్త్రీ పెళ్ళి పట్ల గౌరవంతో, పిల్లల పట్ల ప్రేమతో తను అడ్డుగోడల మధ్య ఒద్దికగా నిలబడిపోతుందని నా నమ్మకం.




నా దగ్గరికి వచ్చే అనేక మంది స్త్రీలలో, వారి మనసులో అంతర్గతంగా ఎన్ని కలలు ఉన్నాయో వాటిని నిర్వర్తించుకునే సామర్థ్యం ఉండికూడా, వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా సామాన్యమైన స్త్రీలలా ఎలా జీవితం గడిపేస్తూ ఆనందంగా ఉన్నారో గమనిస్తే నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఇప్పటి తరం అత్యంత ప్రతిభావంతంగా రూపుదిద్దుకుని, దేశగౌరవం, మన సంస్కృతి, గౌరవం వేయి ప్రభలతో వెలుగొందేలా అందరి మన్ననలూ అందుకుంటోంది అంటే ఈ తరం వెనుక, పిల్లల భవిష్యత్తు కోసం అహోరాత్రులు స్వార్థం లేకుండా పనిచేసిన తలితండ్రులు అయిన నిన్నటి తరం గుర్తుకు వస్తుంది. వారి కలలన్నీ పిల్లలలో రూపు దిద్ది తాము అవాల్సిన విజేతలు వెనక ఉండి ఇప్పటి తరాన్ని ముందు పెట్టి ఆనందం అనుభవిస్తున్నారు. దీనికి ఎంత ఓర్మి కావాలో, ఎంత శ్రమ పడాలో, కొన్ని కుటుంబాల్లో భార్యాభర్తలని చూస్తుంటే అర్థం అవుతుంది.

కలలు కనడం అందరి హక్కు! నిజమే కానీ వాటిని సాకారం చేసుకోవాలంటే అందరికీ చాలా వరకు సాధ్యం కాదు. కలలు మనిషిని ఉత్తేజపరుస్తాయి. వేధిస్తాయి కూడా! గోతుల్లో పడేసి కాలు, కీలు విరక్కొట్టి అందరూ

వెక్కిరిస్తూ నవ్వేలా చేస్తాయి. కానీ పట్టుదలతో జీవితం పట్ల కలలు కని వాటిని సాకారం చేసుకునే వ్యక్తులు ధన్యులు.

నాకు తెలిసిన ఒక కుటుంబంలో ఒకాయన వజ్రాల వ్యాపారం చేస్తాడు. వ్యాపార పరంగా ఆయన విజేత అని చెప్పవచ్చు. కానీ ఆయనకి చిన్నప్పటి నుంచీ పువ్వుల కొట్టు పెట్టుకోవాలని, విదేశాలకి ఎగుమతి చేయాలని, పువ్వులతోట పెంచాలని ఒక డ్రీమ్ వరల్డ్. ఆయన సంపాదించిందంతా మెల్లగా ఈ పువ్వుల కౌగిలి కోసం వెచ్చించసాగాడు. వజ్రాల వ్యాపారం మీద వచ్చినదంతా ఇందులో పెట్టడంతో భారీగా నష్టం రాసాగింది. అయినా ఆయన పట్టుదలగా వదలలేదు. కానీ ఇంట్లో భార్యా, పిల్లలు, స్వంత తల్లితండ్రులతో పెద్ద పేచీ వచ్చేసింది. ఆ పువ్వుల వ్యాపారంలో డబ్బు తగలేస్తున్నాడనీ, అది మూసేయకపోతే అందరూ కలిసి మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. బంధువులు వచ్చి ఈ పువ్వుల పిచ్చి వదిలించటానికి కౌన్సిలింగ్‌కి పంపించాలని నిర్ణయం చేసారు. ఆయనకి నిజంగానే పిచ్చి ఎక్కినంత పనైంది. మొత్తానికి 'పువ్వుల కౌగిలి' నుంచీ ఆయనని భార్యాపిల్లలు, బంధువుల సాయంతో పోరాడి గెలిచి విడిపించారు. అది వారి విజయం. ఇది ఆయన అపజయం. ఇప్పుడు చెప్పండి. కుటుంబాలతో పెనవేసుకు పోయిన మన జీవితాలలో మనలో ఒక్క వ్యక్తికైనా తన కిష్టమైన కలలు సాకారం చేసుకునే స్వతంత్ర్యం ఉందంటారా! నా కయితే చాలా అనుమానమే.

'కలల కౌగిలి' అన్న పేరు నాకెందుకో తట్టింది. ఇది నాకు చాలా ఇష్టం. ప్రతీ మనిషిలోనూ ఈ కౌగిలికి తహతహలాడే ఆంతర్యం ఉంటుంది. అది కెరీర్ కావచ్చు. ప్రేమ కావచ్చు. దేశభక్తి కావచ్చు.

ఎంతో మంది ఆంతర్యాల లోగిళ్ళలోకి వెళ్ళి వాళ్ళ కలలనీ – ఫెయిల్యూర్స్‌ని విన్నదాన్ని నేను.


'కలల కౌగిలి' పేరు ఇన్స్పిరేషన్ నా అభిమాన పాఠకులే!

ఇందులో హీరో తలితండ్రుల ఆప్యాయత కోసం పరితపించే పసిమనసు కుర్రాడు సత్యజిత్. తలితండ్రుల స్వార్థచింతనతో బెంగుళూరులో ఉన్న బంధువురాలికి పెంపకం వెళ్ళి పీనాసి అయిన ఆవిడ చేతిలో నానా బాధలు పడి, ఇంటికి పారిపోయి వస్తే, తలితండ్రులు తీసుకు వెళ్ళి మళ్ళీ సత్యజిత్‌ని, ఆ పీనాసి ఆవిడకి అప్పచెబుతారు. అందరి పిల్లల్లా మామూలు బాల్యం కోసం తపించే సత్యజిత్, పెంపుడు తల్లి అనే రాక్షసి చేతిలో ఇరుక్కుంటాడు. తలితండ్రుల దగ్గరకి ఇక వెళ్ళలేనని తెలుసుకున్న సత్యజిత్ సెల్ఫ్‌డిఫెన్సు కోసం మారిపోతాడు. ఆ నమ్మకాలతోనే పెరిగి పెద్దవాడవుతాడు. డబ్బుగలవాళ్ళని బ్లాక్‌మెయిల్ చేయటం, భయపెట్టడం అతనికి ఒక థ్రిల్. అదే నిజమైన జీవితం అని నమ్ముతాడు. అతని జీవితంలో భారతి ప్రవేశిస్తుంది. అతను ఇంత వరకు 'నమ్మిన' జీవితం అబద్ధం అయినది అని తెలుసుకుని మారటానికి ప్రయత్నిస్తాడు. 'భారతి' అనే మంచి మనిషిని చేరుకోవాలన్నది అతని కల అవుతుంది. కానీ 28 సంవత్సరాల అనుభవం అతన్ని వదలదు. వదిలించుకుని, మంచి జీవితానికి మారుపేరుతో నిలబడిన భారతికి చేరువ అవటానికి అతను పడిన నరకయాతనే 'కలలకౌగిలి'.

మనలో చాలామంది జీవితంలో కొంత దూరం నడిచినిన తర్వాత మార్గం మలుపు తిప్పుకోవాలని తపిస్తాం. కానీ అది అంత సులభసాధ్యం కాదు. కానీ ఈ ప్రపంచంలో పట్టుదల, ఓర్మి అనేవి మనకుంటే మన జీవితానికి మనమే సార్వభౌమాధికారి అవగలం అని నిరూపిస్తుంది ఈ నవల.

***

# స్నేహమయి




ఈ ప్రపంచంలో మనం ఒక్కసారి, మన సంతోషం - మన స్వార్థం - మన అహం ప్రక్కన పెట్టి మన చుట్టూ ఉన్నవారిని గమనిస్తే మన జీవితం మనది అని మనం విర్రవీగే స్వభావం ఎంత అమాయకమైనదో, ఎంత మూర్ఖత్వం నిండినదో మనకి బాగా అర్థం అవుతుంది. ఈ ప్రపంచంలోకి మనం పుట్టేటప్పుడు అందరం ఒకటిగా పుడతాం అని చాలా మంది అంటారు. అది కాదని నాకు అనిపిస్తుంది. అందరం ఒకటిగానే జన్మిస్తే - కొంత మంది అందంగా, కొంతమంది అందవిహీనంగా, కొంత మంది బంగారం చెంచా నోటిలో పెట్టుకుని పుట్టినట్టు సకల భోగాలతో, వారి పుట్టుక కోసం తలితండ్రులు - తాతముత్తాతలు - అన్నలు - అక్కలు బంధువులు - సకుటుంబ సపరివారంగా ఎదురుచూస్తుండగా పుడతారు. ఆ శిశువు పుట్టినప్పటి నుంచీ ఎంత గారాబమో! ఎంత అవసరమైన పెంపకమో! కాస్త గట్టిగా ఏడిస్తే ఇంటిల్లపాదీ పరుగున వచ్చి 'ఏమైంది' అని ఆందోళనతోఆరా తీస్తారు. క్షణాల మీద ఆ శిశువుకి కలిగిన అసౌకర్యం ఊదేసినట్టు తీసేయాలని తాపత్రయ పడతారు. ఇది ఒక వైపు మాత్రమే! ఈ జీవితం అనే నాణేనికి మరోవేపు ఉంది. అక్కడ ఆ శిశువు పుట్టుకే శాపనార్థాలతో, అవమానాలతో ప్రారంభమౌతుంది. చివరికి ప్రాణం ఇచ్చిన తల్లికూడా 'ఈ పీడ'ని ఎలా వదిలించుకోవాలా అని చూస్తుంది. కొంతమంది తల్లి కడుపులో ప్రాణం పోసుకోగానే అనాథలు అవుతారు. ఎందుకంటే - ఈ ప్రపంచంలో ఆ శిశువు కావాలని ఎవ్వరూ కోరుకోరు. మనం మనదేశంలో చెత్తకుండీల్లో పడి ఉన్న శిశువుల్ని, రోడ్డుమీద మాటరాని పసిపిల్లలని వదిలేసి వెళ్ళే తల్లుల్ని ఎక్కువగా చూస్తూ ఉంటాం. అతిపిన్న వయసులో, వీధిలో చెత్త ఏరుకునే పిల్లలు - గారడీ పనులు చేసే పిల్లలు, జైలులో మగ్గుతుండే పిల్లల్ని చూస్తుంటే - మనకి క్రిందటి జన్మ - దాని పాపపుణ్యాల లెక్క ఈ జన్మలో అందుకుంటున్నామా అనిపిస్తుంది.

ఈ ప్రపంచంలో అత్యంత విషాదమైన విషయం - మనిషి నా అనేవారు లేకుండా అనాథలుగా బ్రతకటం. అలాంటి వ్యక్తే 'స్నేహమయి'లో హీరోయిన్ శారద. ఆమెని అదృష్టం నా అనేవాళ్ళు లేకుండా కొంతవరకే శిక్షించింది. కానీ ఆమె మనసుని సాటి మనుష్యుల పట్ల దయ, జాలి, సానుభూతి అని పూర్ణకుంభంతో నింపి ఆశీర్వదించింది.

శారదలాటి వ్యక్తులు పరిస్థితుల్లో దేన్నీ ప్రశ్నించరు. జీవితంలో ప్రత్యేకంగా ఏదీ తమకి స్వంతంగా ఏదీ కావాలని కోరుకోరు, ఇవ్వటమే వారికి తెలుసు! అదే ఆనందం! అదే శాంతి.

అనాధాశ్రమంలో ఉంటున్న శారద, ఒక కుటుంబంలో సేవచేయటానికి అనాధాశ్రమం ప్రెసిడెంట్ ద్వారా వస్తుంది. శారదకి బాల్యం నుంచే జీవితంలో తన హద్దులేమిటో తనకి తెలుసు. అందరికీ తను ఉపయోగపడాలి. సేవ చేస్తున్నంత కాలం వారి అవసరం కోసం, తన శ్రమ ఖర్చు చేస్తున్నంత కాలం అందరూ అభిమానంగానే ఉంటారు. అవసరం తీరిన తర్వాత ఆమెని ఎవ్వరూ తలుచుకోరు. ఎవ్వరికీ అసలు గుర్తుండదు. శారద ఆరోగ్యవంతురాలు అందమైన అమ్మాయి. అయినా ఆమె శరీరానికి కోర్కెలు లేవు. మనసులో స్వప్నాలు లేవు. నిష్కామంగా సేవచేయటం, సంబంధ బాంధవ్యాలలో నిర్లిప్తంగా, నిర్వికారంగా ఉండటంలో ఆమెకి అనాధ ఆశ్రమంవారు పటిష్టమైన ట్రయినింగ్ ఇచ్చారు. శారద అదే తన జీవిత ధ్యేయం అని తెలుసుకుంది. సుఖానికి ఆమె తనకి తాను చెప్పుకున్న నిర్వచనం 'ఈ ప్రపంచంలో ఎవరి నుంచీ ఏమీ ఆశించవద్దు.' పరులకి సేవచేయుటమే మానసిక ప్రశాంతత. ఆమె మానసికంగా చిన్న తనంలోనే ఒక యోగిని. జీవితంలో ఎవ్వరూ 'నువ్వు నాకు కావాలి' అని కోరుకోని ఒంటరితనపు మౌనమూర్తి. శారదలో అసూయలేదు. తనకంటే మిగతావారు సుఖంగా ఉన్నారనే ద్వేషం అసలే లేదు. ఆమె జీవితాన్ని అర్థం చేసుకుంది. వయసు వచ్చిన కొద్దీ, ప్రయత్నపూర్వకంగా, మనసులో ప్రశాంతత అనే దీవి ఏర్పరచుకుంది. అందులో ఆమె హాయిగా ఉంటోంది. కానీ జీవితంలో తమాషా అదే! నీ మానానా నువ్వు నీ పనులు చేసుకుంటూ అందని అనుభవాల గురించి ఆలోచించకుండా, కలల బారిన పడి పీడనకి గురికాకుండా బ్రతకాలని అనుకున్నా కుదరదు. ఇది మీలో మనమంతా అనుభవం చెందే ఉంటాం. ఎక్కడో బలమైన స్వీయ రక్షణ ఉన్నవారే ఇందులో నుంచీ బైటపడగలుగుతారు.

ప్రసాద్ కుటుంబంతో పరిచయం వల్ల శారద ఇదే ఇబ్బందిలో పడింది. అతనికి భార్యలేదు. ఆమె మరణానికి అతనే బాధ్యుడు అనే బలమైన ప్రచారం ఉంది. అది ఎంత వదంతో, ఎంత నిజమో, ఎవ్వరికీ తెలియదు. ప్రసాద్ ఇప్పటికీ అది సరిచేసుకోవాలని చూడడు. అతను ఈ లోకం తిట్టేతిట్లను విని భరించలేక, తనలోకి తనే పారిపోయాడు. ఈ లోకంతో సంబంధంలేని మనిషిలా బ్రతుకుతాడు. అతని పిల్లలు ఎక్కడో పల్లెటూళ్ళో బంధువుల ఇంట్లో బ్రతుకుతుంటారు. ఒకసారి ఆ బంధువు ఆ పిల్లలని ఇక్కడ తెచ్చి వదిలి వెళ్ళి పోతాడు.

ప్రసాద్ అక్కకి ఆస్థంతా లాగాలని, కూతురునిచ్చి తమ్ముడికి పెళ్ళిచేయాలని ఆరాటం. ఆమె ఆ పిల్లల ఉనికే భరించలేదు.

తండ్రి బాధ్యతలేనితనానికి, లోకం నిర్దయకి గురి అయిన ఆ లేత వయసు పసికూనలు శారద మనసు దోచుకుంటారు. ఆ ఇంటికి సేవలో భాగంగానే, దయతో ఆ పిల్లలని అక్కున చేర్చుకుంటుంది. శారదకి ఎవ్వరి మీదా మమకారం ఉండకూడదు. అనాధాశ్రమం ప్రెసిడెంట్, శారదని తన తర్వాత దాని అధికారిణి చేయాలని గట్టిగా తలుస్తోంది. జీవితంలో ప్రప్రథమంగా, శారద మనసు ఆ పిల్లల పట్ల కాస్త తొణికింది. వారు కావాలని కోరుకుంది. నా వాళ్ళు అనే వ్యక్తులు వద్దు అని తోసేయటం శారద ఎంత డిసిప్లిన్ ఏర్పరచుకున్నా మనసులో మారుమూల డిసిప్లిన్ 'పంజరం'లో బందీగా ఉన్న ప్రేమ - ఆప్యాయత - సాధారణమైన స్త్రీ మనసుతో పంజరం తలుపులు తెరుచుకోవటానికి యుద్ధం చేస్తుంది. ఆ యుద్ధంతోనే శారద తన మనసుని తనే భరించలేకపోతుంది.

ఇలాంటి యుద్ధాలు కారణం ఇంకోటి కావచ్చు. తమతో తామే చేసే స్త్రీలని నేను చాలామందిని చూసాను. వారి వ్యధలు వింటుంటే వారికి సముదాయింపుగా చెప్పటానికి ఒక్కసారి నాకు మాటలే దొరకవు. ఆ స్త్రీల మనసుల్లో అంత లోతయిన గాయాలుంటాయి. అందుకే నాకు పదే పదే అనిపిస్తుంది. జీవితంలో పాపపుణ్యాలు అనేవి ఉన్నాయా!


అది భ్రమా! వారందరిదీ మానవ జన్మే అయినా ఏమిటీ తేడాలు. కొంతమందికి తిన్నంత తిని రెట్టింపు పారేసేటంత భోజనం. ఇంకొకరికి ఒక్క మెతుకు అన్నం దొరకని కటిక ఆకలి. ఒకరిది అపురూపమైన సౌందర్యం మరొకరికి భయంకరమైన కురూపితనం. కొంత మంది స్త్రీలని చూస్తున్నాను. వారికి తలితండ్రులు అత్తమామలు భర్త - పిల్లలు అందరూ బాగా చూస్తారు. రాణివాసంలా ఉంటుంది వారి జీవితం. ఇంకా కొంత మంది స్త్రీలు చిన్నప్పటినుంచీ తలితండ్రుల దగ్గర - భర్త దగ్గర - చివరికి పిల్లల దగ్గర కూడా కష్టపడుతూనే ఉంటారు.

నాకు తెలిసిన ఒకామె ఉంది. ఆమె జీవితాన్ని పెళ్ళి అయేంతవరకూ తలితండ్రులు - అన్నలు శాసించారు. పెళ్ళి అయిన తర్వాత అత్తమామలు - భర్త - బావగారు - మరిది - ఆ తర్వాత కొడుకులు కోడళ్ళు. ఆమె వ్యక్తిత్వం ఉన్న మనిషి కాదు. వారందరికీ సేవలు అందించే ఒక యంత్రం. ఆవిడని నేనే అడిగాను, "మీకు ఏంకావాలో మీరు ఎందుకు అడగరు?"

ఆవిడ శాంతంగా, నిదానంగా చెప్పింది. "అడిగితే భయంకరమైన భూకంపాలు - సునామీలు నన్ను అతలాకుతలం చేస్తాయి. వారికి కావాల్సిందేదో చేసి పడేస్తాను. వారు నన్ను ఎలా పట్టించుకోరో నేనూ పట్టించుకోను." ఆమెలో నిర్లిప్తత - నిర్వికారం, తర్వాత ఆలోచించాను ఆమెలా ఉండటానికి కూడా చాలా మనోనిబ్బరం కావాలి అహర్నిశలూ నీకోసం శ్రమ పడే మనిషికి నువ్వు ఇచ్చే బహుమతి ఏమిటి? నిరాదరణా! నిర్దయ! దశాబ్దాల తరబడి మూగగా అన్నీ భరించే స్త్రీల మనసులో నుంచీ పుట్టిన జ్వాలలే ఇప్పటి ఆడపిల్లల తరం అనిపిస్తోంది నాకు. ఇప్పటి తరం ఆడపిల్ల ఎదుటి మనిషి తనని ఎంత విలువ ఇస్తున్నారు అని లెక్క వేయటంలో చాలా ప్రతిభను చూపిస్తోంది. ఈ జ్ఞానం తల్లులు సంవత్సరాల తరబడి పడిన వేదనే వారికి ఒక నిర్దుష్టమైన వ్యక్తిత్వం ఇస్తోంది. ఇది ఏకాలేజీలు ఏ విశ్వవిద్యాలయాలు నేర్పలేనిది. స్త్రీలలో విప్లవం ఎప్పుడూ శబ్దం లేకుండా చాప కింద నీరులా వచ్చేస్తుందని నా గాఢ నమ్మకం.

***

# పెళ్ళి - పిల్లలు - జీవితం




నేను దాదాపు 45 సంవత్సరాలపాటు ఇద్దరు పబ్లిషర్స్‌కి ఎగ్రిమెంట్ రూపంలో ప్రతి సంవత్సరం నవలలు వ్రాసాను. సాధారణంగా అయితే ఇది చాలా టైట్ రోప్ వాకింగే అని చెప్పాలి. కానీ ఈ కమిట్‌మెంట్స్ చాలా సులభంగా తీర్చగలిగిన శక్తి భగవంతుడు నాకు ప్రసాదించాడు.

ముఖ్యంగా నవలా వైవిధ్యానికి వస్తే వందలమంది పాఠకులతో నేను ఎల్లప్పుడూ ఇంటరాక్ట్ అవటం వల్ల వాళ్ళ సమస్యలని అర్థం చేసుకోవటం, సమస్యల్ని వారి వైపు నుంచేగాక, వారి కుటుంబ వ్యక్తులవైపు నుంచీ, సంఘంలో ఆ వ్యక్తికి నిర్దేశించిన బాధ్యతల గురించి, ఆ సమస్యల్లో ఆ వ్యక్తి నలిగిపోయిన చిత్రవధల అనుభవాల నుంచీ విశ్లేషణ చేసుకోవడం, ముఖ్యంగా ఆ పరిస్థితులు నాకు ఎదురైతే నేనేం చేస్తాను? అని నన్ను నేను ప్రశ్నించుకోవడంతో ఈ విశ్లేషణ నాకు అలవాటు అయి, నా మస్తిష్కంలో ఎప్పుడూ వ్యక్తి పరిస్థితులు - సమస్యలు వీటిని స్వీకరించిన భాండాగారం పుష్కలంగా ఉండేది. నాకెప్పుడూ రచనా వ్యాసాంగంలో వస్తు వైవిధ్యం కోసం తడుముకోవాల్సిన అవసరమే ఉండేది కాదు. చాలా సార్లు ఏం వ్రాయాలా అనుకుంటూ ఖాళీ మస్తిష్కంతో టేబుల్ దగ్గర పెన్ తీసుకుని, తెల్ల కాగితాల మీద పెట్టగానే నా మనసు భాండాగారంలో సమయం కోసం వేచి చూస్తున్నట్లున్న సజీవ చిత్రరూపంలా, జవాశ్వాల్లా కథలుగా కాగితాల మీదకి ఉరుకులు పెట్టేవి. ఖాళీ మనసుతో ప్రారంభించిన నేను, సునాయాసంగా క్యారెక్టర్లు, సంఘటనలు రూపు దిద్దుకుంటున్న నవల చూసి ఒక్కోసారి నాకే ఆశ్చర్యం అనిపించేది. ఇదేదీ నా ప్రతిభ కాదని, నాలో అంతర్గతంగా ఉన్న సజీవ భావజాల పరుగులు అని కూడా అనిపించేది.

నిత్య జీవితంలో మనం ఏదో రూపంగా, మన కుటుంబ సభ్యుల్ని కాకుండా, ఎంతోమంది కొత్తవారిని ఏదో సందర్భంలో కలుస్తూనే ఉంటాం. వారిలో క్యారెక్టర్‌ని పట్టుకోవటం, అది గుర్తుపెట్టుకోవడం, నా విషయంలో చాలా సునాయాసంగా జరిగిపోయేది. నా నవలల పట్ల క్రిటిక్స్ సెక్రటరీలో రాజశేఖరంని దాటి, నా రచనలలోకి

రాలేకపోయారు. వాళ్ళు ఎప్పుడు చెప్పినా రాజశేఖరం, అతని పొడుగాటి కారు, ఇంతే. ఈ క్రిటిక్స్ కంటే నా పాఠకులు నన్ను ఎంత అర్థం చేసుకున్నారో, ఇప్పటికీ వస్తున్న రీప్రింట్సే సాక్ష్యం.

నన్ను అభిమానించే నా పాఠకులు, నా పుస్తకాల సేల్స్ ఉన్నాయి కాబట్టే మేం వేస్తున్నాం అని, నిర్మొహమాటంగా చెప్పే నా పబ్లిషర్స్ - ఎప్పుడూ వస్తు వైవిధ్యంతో, రోజూ సామాన్యంగా కనిపించే కుటుంబంలో - ఎన్నెన్ని వ్యక్తిత్వాలు - ఆశలు - నిరాశలు - కోపతాపాలు - ప్రేమలు - నిట్టూర్పులులాంటి రామాయణ - భారతాలు లాంటి వ్యక్తుల సంఘర్షణలలో నేను టైట్ రోప్ వాకింగ్ లాంటి ఈ ప్రొఫెషన్‌ని అలవోకగ ఆడుతూ, పాడుతూ సుదీర్ఘమైన 45 సంవత్సరాలు దాటేశాను. నా ఈ సుదీర్ఘమైన విజయం వెనుక, మన సంఘంలో నిజమైన వ్యక్తిత్వాలు గల మామూలు మనుష్యులు లాంటి పాఠకులు నన్ను ఉత్తేజపరిచారు. అందుకే అందరూ చెప్పే రాజశేఖరం - పొడుగాటి కారు కాకుండా, ఒక పార్థు, ఒక మీనా, ఒక అమరహృదయం, ఒక అర్ధస్థిత, ఒక గిరిజా కళ్యాణం, ఒక బందీ ఇలాంటివి ఎన్నో వచ్చాయి నా కలం నుంచీ. పాఠకుల మన్ననలు పొందాయి. ఎందుకంటే అవి వారికి సజీవ ప్రతిబింబాలు!

ఇలాంటి వాటి వరుసలో నిలబడిందే నేను వ్రాసిన 'పెళ్ళి - పిల్లలు - జీవితం.' ఈ నవల వ్రాసే టైముకి నేను చిన్నదాన్ని. ఇంకా మధ్య వయస్సులో అడుగుపెట్టలేదు. పేరు ప్రతిష్టలతో, సీరియల్స్ తెస్తున్న విపరీతమైన పాపులారిటీతో, సినిమాల శతదినోత్సవాలతో, ఎటు చూసినా ప్రశంసల జల్లులతో అనూహ్యమైన ఆనందంతో, ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమయం గడుపుతున్నదాన్ని.

నా దగ్గర పాఠకులు అనేకమంది వచ్చేవాళ్ళు. వయసు బేధం లేదు. స్టూడెంట్స్, గృహిణులు, వివాహితులు, డైవోర్సీలు, వారివారి ప్రొఫెషన్స్‌తో క్షణం తీరిక చిక్కని వాళ్ళు ముఖ్యంగా చిన్నప్పుడే భర్తపోతే పిల్లల్ని పెంచుతూ, అత్తమామలని సాకుతూ, మరుదుల, ఆడపడచుల పెళ్ళిళ్ళు చేస్తూ - ఇలాంటి స్త్రీలని చూస్తుంటే నా మనసుకి అర్థమయేది. ఆ స్థితిలో నన్ను ఊహించుకునేదాన్ని! నేను వారిలా అంత నిస్వార్థంగా కుటుంబానికి సేవ చేయగలనా అని నన్ను నేను ప్రశ్నించుకునేదాన్ని. ఊహూ! అంత ఉదారత్వం నాలో లేదు అనే నిజాయితీతో కూడిన నిష్కర్షమైన జవాబు నాకు వచ్చేది.

ఆ కుటుంబం ఏమి తిరిగి ఇస్తే - ఈ స్త్రీ చేసిన సేవకి - పంచి ఇచ్చిన ప్రేమకి ఋణం తీరుతుంది? మీ జీవితాలు నిలబెట్టిన ఈ స్త్రీ తన వయసుని త్యజించుకుంది. కోరికలు లేకుండా మానసిక సన్యాసిని అయింది. కుటుంబమే సర్వస్వం అనుకుంది. తన సుఖం అనే పదాన్ని తన జీవిత నిఘంటువులో నుంచీ తుడిచేసింది. ఇలాంటివి సాధారణంగా కనిపించే, అత్యుత్తమమైన ఔన్నత్యం గల స్త్రీలు మన చుట్టూ వందలమంది కనిపిస్తారు. ఈమె జీవితం చూస్తే సంవత్సరాల తరబడి వాన కురవక పోయినా, భూమిని నమ్ముకుని, ఎర్రటి ఎండలో, నాగలి పట్టి పొలం దున్నే రైతు నాకు గుర్తుకు వస్తాడు. ఈ గృహిణి, ఆ రైతు ఈ ఇద్దరూ నాకత్యంత ఆత్మీయులు.

ఒకసారి నేను నా పబ్లిషర్స్‌కి నవల ఇవ్వాలి. పబ్లిషర్‌కి నా నవల వస్తుందంటే, ఆరోజుల్లో ముందే కాపీలకి ఆర్డర్ ఉండే అదృష్టవంతురాలు అయిన రచయిత్రిని నేను.

నా మనసులో ఒదిగి ఉన్న ఈ స్త్రీ మూర్తి బైటికి వచ్చింది. అదే 'పెళ్ళి - పిల్లలు - జీవితం.' ఇది నా కిష్టమైన నేను దణ్ణం పెట్టే స్త్రీ మూర్తి జీవిత చిత్ర కథ. ఇందులో రొమాన్స్ లేదు, సస్పెన్స్‌లేదు. చిన్నతనంలోనే భర్తపోతే, ఏటికి ఎదురీత, ఆ పిల్లల్ని గుండెలకి అదుముకుని, పెంచి పెద్ద చేసిన తల్లి కథ. చిన్నతనంలోనే పెళ్ళి అవడం వల్ల, ఆమెకి

నడి వయసు వచ్చేసరికి పిల్లలు వారి వారి జీవితాల్లో సెటిల్ అయ్యారు. ఆమెది ఒంటరి జీవితం. పనిచేసే ఉత్సాహం - శక్తి ఉన్నాయి. ఆమె జీవితంలోకి బాల్య మిత్రుడు వస్తాడు. ఈ పరిచయం వృద్ధి అవుతుంది. ఆమెకి కాస్త ఊరట. జీవితంలో కాస్త వెన్నెల. కానీ సంఘం దుమ్మెత్తి పోస్తుంది. ఎందుకు? స్త్రీని నిర్దయగా, నిర్లజ్జగా, వాడుకోవడమే తెలిసిన సంఘానికి, ఆమె కుటుంబానికే అంకితం కావాలని శాసించే ఈ సంఘానికి ఆమె వ్యక్తిగా ఎదుర్కొంటున్న ఒంటరితనం అవసరం లేదు. ఆమె ఒకవ్యక్తి కాదు. ఒక వస్తువు. వాడుకుని అవతల పారేసే వస్తువు.

ఇది స్త్రీగా నాకు చాలా అన్యాయం అనిపించేది. నేను బహుశా ఈ సంఘం మీద మౌనంగా తిరగబడ్డాను. ఇలా స్త్రీ ఎందుకు ఉండకూడదు అనే ప్రశ్న వారి ముందు పెట్టాను. ఈ సంఘం నాకు జవాబు చెప్పలేక పోయింది. ఇలాంటి స్త్రీలు వందల మందికి నేను ఇంకా ఇంకా అభిమాన పాత్రురాలిని అయ్యాను. ఎందుకంటే వాళ్ళని రిప్రజెంట్ చేశాను. వారి తరపున సంఘాన్ని నిలదీశాను.


నేను చాలా మామూలుగా పబ్లిషర్స్‌కి కమిట్‌మెంట్ అనుకుంటూ వ్రాసిన నవల, చాలామంది మధ్యవయసు స్త్రీలకు నన్ను దగ్గర చేసింది. అందుకే ఎప్పుడూ చెబుతాను. నా ఈ పాఠకులు, వారి సమస్యలు, వారి కుటుంబాలు అన్నీ నాకు సంబంధించినవే! వారికి నేను వారిలో ఒక మనిషిని. క్రిటిక్స్, రాజశేఖరం, పడవంత కారు అని నన్ను హేళన చేయాలని చూస్తే నా పాఠకులు నాకిచ్చిన ఆత్మ ధైర్యంతో 'మీరు నా దరిదాపుల్లోకి రాలేరు' అని నా చూపులే మౌనంగా జవాబు చెబుతాయి.

నా ఈ నవల 'పెళ్ళి - పిల్లలు - జీవితం' అనగానే, నాకెంతోమంది పాఠకులు అయిన ఒక వర్గం స్త్రీల అభిమాన చందన పరిమళాలు నన్ను ముంచెత్తుతాయి.

ఇప్పుడు ఈవిధంగా, కౌముది ద్వారా - దాదాపు 25 ఏళ్ళ క్రితం వ్రాసిన నా ఈ చిన్న నవల గురించి మీతో నా మనసులో ఆలోచనలు పంచుకోవడం నాకెంతో ఆనందంగా ఉంది.

***

## నిశాంత




ఈ ప్రపంచంలో మనిషి మస్తిష్కానికి మించిన సూపర్ కంప్యూటర్ యింకేమీ లేదేమో! మనిషి ఆలోచనల్ని శరీరాల్ని అది కంట్రోల్ చేసే విధం చూస్తే నాకు అత్యంత అద్భుతంగా వుంటుంది. మనిషి తన 'మేధస్సు'ని ఆయుధంగా చేసుకుని దానితో యీ ప్రకృతినీ, సాటి మనిషిని లొంగదీసుకుని జయకేతనం ఎగరవేసినప్పుడే అతని ఆనందానికి పరాకాష్ట. మనిషి సుప్రీం! అతనికి ఈ భూప్రపంచం అంతా తలఒగ్గాల్సిందే! కంప్యూటర్లతో అతను సాదించనిది లేదు అనే రోజు తప్పక వస్తుంది. ఈ శతాబ్దంలో మనిషికి అత్యంత ప్రియనేస్తం కంప్యూటర్ ఒక్కటే - ఇది పృధ్వీ అభిప్రాయం.

కానీ పరంజ్యోతి అభిప్రాయం పూర్తిగా భిన్నం.

"మనిషి ప్రకృతిని ప్రేమించి, మహా చైతన్యంతో సహజీవనం గావించాలి. మేధస్సుతో ఎంత ప్రగతి సాధిస్తే మాత్రం ఏం ప్రయోజనం? మనసుని చీకటి గుహగా మార్చేసుకుంటున్నప్పుడు? అది అతని విజయంకాదు. అధఃపతనం."

అటు పృధ్వీ, ఇటు పరంజ్యోతి ఇద్దరికీ నిశాంత అంటే విపరీతమైన ప్రేమ. ఆమె జీవిత కూడలిలో నిలబడింది. ఇటు పృధ్వీ ఒక వైపు ధగద్ధగాయమానం అయిన భవిష్యత్ వైపు చూపిస్తూ తనతో సహచరిగా రమ్మని అడుగుతున్నాడు.

పరంజ్యోతి ప్రశాంతత, జీవితం పట్ల అతనికున్న నమ్మకాలు, విలువలు నిశాంతకి ఇష్టం. అతనితో తన జీవితం చాలా సుఖశాంతులతో గడుస్తుందని గాఢనమ్మకం. ఆమె పరంజ్యోతినే కోరుకుంటుంది. పరంజ్యోతికి నిశాకి ఎలాంటి వాగ్దానాలు చేయడు. అతని మనసుకి కూడా ప్రశాంతతే తప్ప భవిష్యత్ పట్ల కలలు లేవు.

పృధ్వీ ఒక పెద్ద సునామి. ఒక పెద్ద భూకంపం. అతని రాక ఎదుటివారి జీవితంలో ఏ కలల్నీ మిగలనివ్వదు. అతనికి నిశ అంటే ప్రేమ. నిశా తనకి కావాలి అంతే. నిశాకి తనంటే ఎలాంటి భావం వుంది అనే ఆలోచన రాదతనికి. నాకేం తక్కువ అనే అహంకారపు ధోరణి.

ఒక సారి ప్రేమ మనిషిని ఎంత విసిగిస్తుందో, అతి సామాన్యమైన జీవితమే మనిషికి ఎంత శ్రీరామరక్షో నిశాంత నవల తెలుపుతుంది.

ఈ నవల వ్రాసే ముందే నేను పృధ్వీ, పరంజ్యోతి భావాలున్న యువకుల్ని చూశాను. తెలివిగల అమ్మాయి అయిన నిశాంత లాంటి వారిని చూసాను. ప్రేమని పొందినా, ప్రేమలో విఫలమైనా, ఆడపిల్లది ఎప్పుడూ అభద్రతాభావం నిండిన మనసే. నిశాంతని చూస్తే మనకి జాలి వేస్తుంది. ఒక మనిషి ప్రశాంతంగా బ్రతకటానికి చుట్టుపక్కల వాళ్ళు, ప్రకృతి, అదృష్టం – ఎన్ని సమగూరితే గాని 'ప్రశాంతమైన జీవితం' పొందే అదృష్టం రాదు.
ఈ నవల చదివిన తర్వాత మిమ్మల్ని మీరే 'నేనెంత ప్రశాంతంగా వున్నాను?' అని ప్రశ్నించుకోవచ్చు. జవాబు మీ ఒక్కరికే తెలుస్తుంది. ***